ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 21.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

శనివారం 8 నవంబరు 2025



మంత్రి నారా లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్

# యువనేతకు ఘనస్వాగతం

- వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు
- పుష్పగుచ్ఛాలు, గజ మాలలతో ఆహ్వానం
- అందరినీ పలకరిస్తూ కళ్యాణదుర్గం వెళ్లిన మంత్రి లోకేశ్



గజమాలతో స్వాగతం

ధర్మవరంలో జనసందోహం నడుమ మంత్రి లోకేశ్





మంచి చేశాం.. ప్రజలకు చెప్పండి

మంత్రి లోకేశ్

6



చేనేత మగ్గం నమూనాను నారా లోకేశ్‌కు అందజేస్తున్న టీడీపీ శ్రేణులు

పుట్టపర్తి, ధర్మవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న భక్త కనకదాసు 538 జయంతి ఉత్సవాలలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు జిల్లాలో ఘన స్వాగతం లభించింది. ప్రత్యేక విమానంలో పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మెన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, జేసీ మౌర్య భరద్వాజ్, అడిషనల్ ఎస్పీ అంకిత, ఎమ్మెల్యేలు కందికుంట, అలిమినేని, పల్లె సింధూర, దగ్గుపాటి, ఎంఎస్ రాజు, బండారు శ్రావణి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, పార్టీ రెండు జిల్లాల అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, వెంటకశివుడు యాదవ్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బీవీ వెంటకరాముడు, ఆర్టీసీ జోనల్ చైర్మెన్ పూల నాగరాజు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యే పల్లె సింధూర ఆహ్వానించారు. మంత్రి నారా లోకేశ్ మధ్యాహ్నం 2.15 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకోవాల్సి ఉండగా.. రెండు గంటలు ఆలస్యంగా వచ్చారు. అయినా నాయకులు, కార్యకర్తలు ఆయన కోసం ఎదురుచూశారు. జిల్లాలో దారి పొడవునా లోకేశ్‌కు ఘన స్వాగతం లభించింది. పుష్పగుచ్ఛాలు అందజేసి, సెల్ఫీలు దిగారు. ధర్మవరంలో గజమాలతో స్వాగతం పలికారు. దారి పొడవునా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి అభిమానాన్ని చాటుకున్నారు. అక్కడక్కడ ఆగుతూ, కార్యకర్తలు, నాయకులను పలకరిస్తూ, అభివాదం చేస్తూ మంత్రి లోకేశ్ ముందుకు సాగారు.

## స్టీల్ పరిశ్రమపై విజిలెన్స్ దాడులు

- తూకాల్లో తేడా గుర్తించిన అధికారులు
- పలు పత్రాల స్వాధీనం



స్టీల్ పరిశ్రమలో తనిఖీలు చేస్తున్న అధికారులు

హిందూపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): గోళ్లాపురం పారిశ్రామిక వాడలోని స్టీల్ పరిశ్రమపై శుక్రవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఏఈ జమాల్ బాషా ఆధ్వర్యంలో వాణిజ్య పన్నులశాఖ, తూనికలు, కొలతలు, కాలుష్య నియంత్రణ, కార్మిక, ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులు కుబేర స్టీల్, పవర్ మైస్ ఫెర్రో పరిశ్రమలో దాడులు నిర్వహించారు. ముడి సరుకుల తూకాల్లో తేడా ఉండటంతో రూ.5 లక్షలు జరిమానా విధించారు. పరిశ్రమలో అధికంగా ఉత్పత్తి చేస్తూ.. రికార్డుల్లో తక్కువ చూపడంపై ఎలక్ట్రికల్ బిల్లులు క్రయవిక్రయాలకు చెందిన పత్రాలు స్వాధీనం చేసుకుని వాటిని వాణిజ్యపన్నుల శాఖాధికారులకు అప్పగించారు. వీటిని పూర్తిస్థాయిలో పరిశీలిస్తే అవకతవకలు బయటపడతాయని విజిలెన్స్ సీఐ జమాల్ బాషా తెలిపారు. పరిశ్రమలో కాలుష్య నియంత్రణ నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించారు. ఎంతమేర ప్రభుత్వానికి గండి కొడుతున్నారో మూడు, నాలుగు రోజుల్లో గుర్తించవచ్చన్నారు. దాడుల్లో సీటీఓ కృష్ణవేణి, పరిశ్రమల అధికారి మురళీకృష్ణ, తూనికల కొలతల అధికారి శివశంకర్, కాలుష్య నియంత్రణ అధికారి కృష్ణారెడ్డి, కార్మికశాఖ నుంచి శేఖర్‌బాబు, ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారి సురేష్‌బాబు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## పక్కాగా పారిశుధ్య పనులు

- స్వచ్ఛ పుట్టపర్తిగా తీర్చిదిద్దుతాం
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి



సమావేశంలో మాట్లాడుతున్న పట్టాభిరామ్, కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలని అధికారులను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో కలిసి మున్సిపల్, పంచాయతీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి శతజయంతి దృష్ట్యా పుట్టపర్తికి ప్రతిరోజు 75 వేల మంది భక్తులు, ప్రజలు వచ్చే అవకాశం ఉందన్నారు. వీరందిరికీ అవసరమైన మరుగుదొడ్లు, తాగునీరు ఏర్పాటు చేసి ఎక్కడ పారిశుధ్య సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పుట్టపర్తి మున్సిపాలిటీకి 10 చెత్త తరలించే వాహనాలు, 4 చెత్త ఊడ్చే వాహనాలు అదనంగా సమకూరుస్తామని ఆయన తెలిపారు. పుట్టపర్తిలో మురుగునీటి తరలింపు సమస్యను పరిష్కరిస్తామన్నారు. స్వచ్ఛ పుట్టపర్తిగా తీర్చిదిద్దుతామన్నారు. సత్యసాయి ట్రస్టు ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంగా పనిచేసి సత్యసాయి శతజయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అంతకుముందు కలెక్టర్ సత్యసాయి శతజయంతి సందర్భంగా పుట్టపర్తిలో చేపట్టిన మౌలిక వసతులు, ఏర్పాట్ల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి ప్రభాకర్, పుట్టపర్తి డీపీఓ సమత, సత్యసాయి ట్రస్టు ప్రతినిధులు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.





క్రీడాపోటీల ప్రారంభోత్సవ వేదికపై సీసీఎల్ఏ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి, కలెక్టర్లు, అనంతపురం-అనకాపల్లి జట్ల మధ్య కబడ్డీ పోటీ

# విధుల్లోనూ క్రీడా స్ఫూర్తి చాటండి

- రెవెన్యూ క్రీడాపోటీలు అభినందనీయం
- సీసీఎల్ఏ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి
- ఒత్తిడికి 'ఆట'విడుపు: కలెక్టర్ ఆనంద్
- క్రీడలతో, ఐక్యత, బాధ్యత మెరుగు
- ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు
- అనంతలో ఘనంగా ఏడో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడోత్సవాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఒత్తిడిలో ఉండే రెవెన్యూ ఉద్యోగులు కలిసికట్టుగా క్రీడాపోటీల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని సీసీఎల్ఏ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని విధుల్లోనూ ప్రదర్శించి సత్ఫలితాలు సాధించాలని ఆమె అభిలషించారు. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఏడో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతికోత్సవాలు శుక్రవారం అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లు ఆనంద్, శ్యాంప్రసాద్, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్లు, ఇతర అధికారులతో కలిసి ఆమె క్రీడాజ్యోతిని వెలిగించి, పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి మాట్లాడుతూ అనంతపురంలో ఏడో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతికోత్సవాలు (మిగతా 7లో..)



సత్యసాయి జిల్లా ఉద్యోగుల మార్చ్‌ఫాస్ట్

## మహిళలు, చిన్నారుల రక్షణే ప్రథమ కర్తవ్యం

- నూతన ఏఎస్పీ అంకిత సురాన మహావీర్



ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అంకిత సురాన మహావీర్

పుట్టపర్తి రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళలు చిన్నారుల రక్షణే ప్రథమ కర్తవ్యంగా విధుల నిర్వర్తిస్తానని నూతన ఏఎస్పీ అంకిత సురాన మహావీర్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆమె ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈమె మన్యంజిల్లా పార్వతీపురం సబ్‌డివిజనల్ పోలీసు ఆఫీసర్‌గా పనిచేస్తూ ఏఎస్పీగా ఉద్యోగోన్నతిపై జిల్లాకు వచ్చారు. అనంతరం ఎస్పీ సతీష్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో కలిసి, పూలమొక్కను అందజేశారు. ఏఎస్పీ పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మైనింగ్ ప్రాంతంలో రాడార్ సర్వే

మీరు వెళ్లడానికి వీళ్లేదు..!

- పుట్టపర్తిలో ప్రొటోకాల్ గొడవ

రద్దీకి తగ్గట్టుగా బస్సులు

- ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

7

# ప్రజల భాగస్వామ్యంతోనే అడవుల పరిరక్షణ

- నగరవనంలో ఘనంగా కార్తీక వన సమారాధన
- పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు



ఫుట్‌బాల్ ఆడుతున్న కలెక్టర్, అధికారులు

పుట్టపర్తి టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే అడవుల పరిరక్షణ సాధ్యమని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా సామాజిక వనవిభాగం డీఎఫ్ఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పుట్టపర్తి మండల అమగొండపాళ్యం నగరవనంలో శుక్రవారం నిర్వహించిన కార్తీక వన సమారాధనలో కలెక్టర్, జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణం దైవంతో సమానమన్నారు. దేవుడిని పూజించినట్టే పర్యావరణాన్ని కూడా పూజించి పరిరక్షించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరి ఆధ్యాత్మికత ప్రకృతికి దగ్గరగా ఉండాలనే మన సంప్రదాయంలో కార్తీక వనభోజనాలకు అత్యంత ప్రాముఖ్యత ఉందన్నారు. సామాజిక వనవిభాగం డీఎఫ్ఓ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కోటి మొక్కల పెంపకమే లక్ష్యంగా ఈ ఏడాది జూన్ నుంచి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు 61 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. కార్తీక మాసం ప్రాముఖ్యత, వనభోజనాలు, వాటివల్ల కలిగే లాభాలు, ప్రకృతిని కాపాడటం అనే అంశాలను వివరించారు. డీఎఫ్ఓ చక్రపాణి మాట్లాడుతూ.. గతనెల 22 నుంచి జిల్లా వ్యాప్తంగా వనం-మనం కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సత్యసాయి జిల్లాలో 14శాతం అడవులు, 20 శాతం వృక్షజాతులు ఉన్నాయని, వీటిని స్వర్ణాంధ్ర విజన్-2047 నాటికి 50 శాతానికి తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన క్విజ్, వ్యాస వక్తృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్ పోటీలలో కలెక్టర్ పాల్గొని అందరిలో ఉత్సాహం నింపారు. అనంతరం అందరితో కలిసి కార్తీక వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత, సెరికల్చర్ అధికారిణి శోభారాణి, సమాచార శాఖ పీడీ పురుషోత్తం, జిల్లా దేవదాయ శాఖ అధికారి నరసింహరాజు, డీఎస్డీఓ ఉదయభాస్కర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్థానిక నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రజలు పాల్గొన్నారు.

# సాయం కరువు!

## కరువు మండలంగా ప్రకటించినా ప్రయోజనం శూన్యం

- అందని బీమా.. దక్కని ఇన్‌పుట్ సబ్సిడీ
- నష్టాలతో అల్లాడుతున్న రైతులు

నంబులపూలకుంట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కరువు మండలంగా ప్రకటించినా తమకు ఒరిగిందేమీ లేదని మండల రైతులు వాపోతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 2023-24, 2025 సంవత్సరాలకు నంబులపూలకుంటను కరువు మండలంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే నేటి వరకు రైతులకు పంటల బీమాగాని, ఇన్‌పుట్ సబ్సిడీకానీ అందలేదు. వైసీపీ పాలనలో ఎలాంటి ఆసరా దొరకలేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో సాయం అందుతుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. పెటుబడులకు చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక రుణదాతలకు ముఖం చాటేసే పరిస్థితి నెలకొందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు రుణ ఒత్తిడులు తాళలేక భూములను తెగనమ్మి అప్పు తీరుస్తున్నారు. గత ప్రభుత్వం వ్యవసాయానికి తగిన సమయంలో కాస్త సాయం చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని కొందరు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పెట్టుబడులు లేక నీటి పారకమున్న భూములను సైతం బీళ్లుగా వదిలేసే పరిస్థితి నెలకొంది. కనీసం గుత్తకు ఇద్దామన్నా ఎకరాకు రూ.ఐదు వేలు ఇచ్చే వారు కూడా కరువయ్యారు.

జిల్లా వ్యాప్తంగా బీమా చెల్లించిన వివరాలు ఇలా...

| పంటలు | రైతులు | భూమి ఎకరాలు | బీమా మొత్తం రూ. |
|---|---|---|---|
| వేరుశనగ | 3,59,825 | 1,68,256 | 107,68,37,428 |
| పత్తి | 16 | 8.88 | 1.34,956 |
| బత్తాయి | 415 | 286.99 | 35,51,544 |
| టమోటా | 1,501 | 404 | 45,33,537 |
| దానిమ్మ | 13 | 60.85 | 12,55,131 |
| మొత్తం | 3,61,888 | 1,69,018 | 108,63,12,598 |

### దక్కని పెట్టుబడి

గత కొన్నేళ్లుగా మండలంలో వేరుశనగ సాగు చేసిన రైతులు అనావృష్టి, విపరీత వాతావరణ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయారు. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి, సరైన దిగుబడి రాక అప్పుల పాలయ్యారు. కనీసం పెట్టుబడి కూడా దక్కక అప్పుల ఊబిలో కూరుకుపోయారు. రబీలో అయినా నీటి పారకం ఉన్న రైతులకు సబ్సిడీపై విత్తన వేరుశనగ అందించాలని రైతులు కోరుతున్నారు. పంటల బీమాతోనైనా కాస్త ఉపశమనం కలుగుతుందేమోనని మండల రైతులు ప్రీమియం చెల్లించారు.



2024లో వర్షం లేక ఎండిపోయిన వేరుశనగ పంట

### వాతావరణ బీమా

చీనీ, దానిమ్మ, టమోటా, పత్తి, వేరుశనగ సాగుచేసిన రైతులకు వాతావరణ బీమా వర్తిస్తుంది. ఈపంటలో సాగుచేసే సమయంలో గాలిలో ఉండే తేమ, మంచు, వర్షపాతం, ఉష్ణోగ్రత ఆధారంగా వాతావరణ బీమా మంజూరు అవుతుంది.

### దిగుబడి ఆధారంగా..

ఖరీఫ్‌లో సాగుచేసిన కంది, వరి, మొక్కజొన్న, రాగి, ఆముదం పంటలకు దిగుబడి ఆధారిత బీమా వర్తిస్తుంది.



### ఒక్క రూపాయి రాలేదు

గత మూడేళ్లుగా మండలాన్ని తీవ్ర కరువు ప్రాంతంగా ప్రకటించినా, ఒక్కరూపాయి కూడా రైతులకు రాలేదు. పెట్టుబడి సాయంకూడా చేతికందక, వ్యవసాయం రైతులకు భారమవుతోంది. ప్రభుత్వం ఆసరా ఇవ్వకపోతే పెట్టుబడులకు అప్పులిచ్చేవారులేక రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వాలు ఆదుకోకపోతే, భూములు వదిలేసి వలస వెళ్లక తప్పదు.

-సూర్యనారాయణరెడ్డి, చీమలచెరువుపల్లి

### ప్రభుత్వాలు ఆదుకోవాలి

ప్రతి ఏటా రైతులు నష్టపోతూనే ఉన్నారు. ప్రభుత్వాలు ఆదుకుని, రైతుల కన్నీటిని తుడవాలి. ఇన్సూరెన్స్, ఇన్‌పుడ్ సబ్సిడీ ఇవ్వాలి. పంటలు నష్టపోయినా, బీమా మాత్రం మంజూరు కావడంలేదు. ప్రభుత్వం రైతులను ఆదుకోకుంటే ఆత్మహత్యలు, వలసలు తప్పవు.

-నాగరాజు, వంకమద్ది



## కూటమిలో బీసీలకు పెద్దపీట

కనకదాస జయంతికి శాశ్వత జీవో

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



కళ్యాణదుర్గంలో భక్త కనకదాస జయంతి, విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

6

# ప్రజలకు చెప్పండి..!

## 16 నెలల్లో ఎన్నో మంచి పనులు చేశాం

- వైసీపీ ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టండి
- పనిచేసినవారికి నామినేటెడ్ పదవులిచ్చాం
- కూటమి కార్యకర్తలు కలిసికట్టుగా వెళ్లాలి
- ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- కళ్యాణదుర్గంలో కార్యకర్తలతో సమావేశం
- యువనేతకు జనం, శ్రేణుల ఘన స్వాగతం



మంత్రి లోకేశ్ అభివాదం

కళ్యాణదుర్గం, అనంతపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనుల గురించి ప్రజలకు తెలియజేయాలని టీడీపీ కార్యకర్తలు, నాయకులకు మంత్రి నారా లోకేశ్ సూచించారు. గడిచిన 16 నెలలలో ఎన్నో మంచి పనులను చేశామని ఆయన అన్నారు. కళ్యాణదుర్గంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ కార్యకర్తలు, నేతల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఉత్తమ కార్యకర్తలకు ఆయన అవార్డులను అందించి, సన్మానించారు. లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించి ఏపీని దేశంలో నంబర్ వన్ చేస్తామన్నారు. గతంలో ఎంతోమంది నిరుద్యోగులు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల వైపు ఉపాధి కోసం వెళ్లేవారని పేర్కొన్నారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఆయా రాష్ట్ర ప్రజలు కూడా ఏపీ వైపు చూసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఎంతో మంది పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం టీడీపీకి కంచుకోట అని, ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. తన సొంత నిధులు కూడా వెచ్చించి నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడుపుతున్నారన్నారు. కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి పునాది, బలం అన్నారు. వారి శ్రమను, కృషిని ఎన్నటికీ మరచిపోలేమన్నారు.

### అనుభవంతో నడిపిస్తున్నారు..

చంద్రబాబు తనకున్న అనుభవంతో రాష్ట్రాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్నారని లోకేశ్ అన్నారు. 'ఐదేళ్లు ఎన్నో ఇబ్బందులు పెట్టారు. నాపై అక్రమ కేసులు పెట్టారు. పాదయాత్రలో ఇబ్బందులకు గురిచేసినా కార్యకర్తలు అండగా నిలిచారు. అందరూ వస్తారు. ఆ రోజుల్లో బయటకు రావాలంటే భయం. ఎక్కడ ఇబ్బంది పెడతారో... కేసులు పెడతారోనని..! పక్కనే ఒక ఇల్లు ఉంది చూశారా.. లైటే లేదు. అదీ తెలుగుదేశం పార్టీ దెబ్బ' అని అన్నారు. 'టీడీపీ అంటే అనంతపురం... అనంతపురం అంటే టీడీపీ అని లోకేశ్ అన్నారు. 'మా కుటుంబాన్ని మీరు ఆశీర్వదించి దీవించారు. ఎన్టీఆర్, హరికృష్ణ, బాలకృష్ణను అక్కున చేర్చుకుని గెలిపించారు. మొన్నటి ఎన్నికల్లో సూపర్ మెజార్టీ ఇచ్చారు..' అని కృతజ్ఞతలు తెలిపారు.

### సవాళ్లు అంటే ఇష్టం..

'నాకు సవాళ్లు అంటే ఇష్టం. అందుకే విద్యాశాఖను ఎంచుకున్నాను. మంగళగిరిలో మొదటిసారి పోటీ చేసినప్పుడు ఓడిపోయాను. అనేక రకాలుగా అవమానించారు. మొన్నటి ఎన్నికల్లో 91 వేల మెజార్టీతో గెలిచాను. అక్కడి నుంచి సౌండ్ లేదు. డీఎస్సీపైనా అనేక విధాలుగా మాట్లాడారు. 150 రోజుల్లో నిర్వహించి నియామకాలు చేపట్టాం. రాష్ట్రానికి అనేక పెట్టుబడులు తీసుకొస్తున్నాం. మన పిల్లల భవిష్యత్తు కోసం సీఎం ఎంతో కష్టపడుతున్నారు' అని లోకేశ్ అన్నారు. 'ఎన్నాళ్లు పక్కనున్న తమిళనాడు, కర్ణాటక, తెలంగాణను చూసి అసూయపడతాం..? ఏపీని చూసి పొరుగు రాష్ట్రాలు అసూయపడే రోజులు తీసుకువస్తాం' అని లోకేశ్ అన్నారు.

### అబద్ధాలు చెప్పడంలో వైసీపీ దిట్ట...

'సీఎం చంద్రబాబును అనేక రకాలుగా అవమానించారు. మా తల్లిని అవమానించారు. ఎవరినీ వదిలిపెట్టేది లేదు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో 9 మంది భక్తులు చనిపోతే... ఆలయ నిర్వాహకుడు పాండా మాట్లాడిన మాటలపై ఫేక్ వీడియో తయారు చేసి వైసీపీ వాళ్లు దుష్ప్రచారం చేశారు. స్వామిని ప్రజల వద్దకు తీసుకెళ్తామని 94 సంవత్సరాల పాండా రూ.20 కోట్లు పెట్టి గుడి కట్టారని అన్నారు. ఘటన జరిగిన వెంటనే తాను, కేంద్ర మంత్రి రామ్మోహన్, రాష్ట్ర మంత్రులు అచ్చెన్న, అనితమ్మ హుటాహుటిన అక్కడకు వెళ్లామని అన్నారు. వైసీపీ వాళ్లు అది కూడా పాండా వ్యాఖ్యలను ఎడిట్ చేసి పర్మిషన్‌కు అప్లయ్ చేస్తే ఇవ్వలేదని ఫేక్ చేశారని మండిపడ్డారు. వైసీపీ వారికి శవ రాజకీయాలు వెన్నతో పెట్టిన విద్యన్నారు.

### చెల్లెమ్మ.. శ్రీచరణి..

మన తెలుగు బిడ్డ, క్రికెటర్ శ్రీచరణిని మూడు నెలల క్రితం విశాఖలో కలిసి బాగా ఆడాలని ప్రోత్సహించానని లోకేశ్ అన్నారు. వరల్డ్ కప్‌లో విజయం సాధించాక చెల్లెమ్మకి మంచి రివార్డు ఇవ్వాలని నిర్ణయించుకున్నామని అన్నారు. ఈలోగానే వైసీపీ వాళ్లు అక్కడ కూడా కులం ప్రస్తావన తెచ్చేందుకు ప్రయత్నించారని అన్నారు. ఈరోజు ఉండవల్లిలో శ్రీచరణి నన్ను కలిసినప్పుడు 24 గంటలు ఎలా కష్టపడుతున్నారని అడిగిందని అన్నారు. రాజకీయాల్లో మార్పు తేవాలంటే కష్టపడి పని చేయక తప్పదు.. గతంలో 32 మంది కమ్మ డీఎస్పీలకు ప్రమోషన్ ఇచ్చామని తప్పుడు ప్రచారం చేశారని, చివరకు నలుగురు మాత్రమే ఉన్నారని తేలిందని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా... అధికారంలో ఉన్నా... చంద్రబాబు రేయింబవళ్లు కష్టపడతారని అన్నారు. 75 ఏళ్ల వయస్సులోనూ ప్రధాని మోదీ ఎంతో కష్టపడుతున్నారని అన్నారు. అందుకే వారిలో వయోభారం కనబడదని అన్నారు.



అమ్మా నమస్కారం..

### చాలా అవసరం...

టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు కలిసికట్టుగా రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నాయని లోకేశ్ అన్నారు. పదిహేనేళ్ల పాటు మనం కలిసికట్టుగా కృషి చేసి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలుపుదామని పవనన్న చెబుతున్నారని, ప్రభుత్వం కొనసాగింపు చాలా అవసరమని అన్నారు. గుజరాత్, ఒడిశాలో ప్రభుత్వ కొనసాగింపు వల్ల అభివృద్ధి జరిగిందని అన్నారు. రాష్ట్రంలో మూడు పార్టీలు కలిసికట్టుగా ముందుకు వెళ్తాయని లోకేశ్ అన్నారు. కష్టపడినవారికే నామినేటెడ్ పదవులు ఇచ్చామని మంత్రి లోకేశ్ అన్నారు. కష్టపడేవారికి ఖచ్చితంగా తగిన ఫలితం ఉంటుందని ఆయన అన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు

### జగన్‌రెడ్డి.. కార్యకర్తలను పట్టించుకోలేదు...

జగన్‌రెడ్డి ఏనాడూ సొంత పార్టీ కార్యకర్తలను పట్టించుకోలేదని, కనీసం కార్యకర్తలకు చేయి అందించడని లోకేశ్ విమర్శించారు. కనీసం ఒక్క ఫొటో ఇవ్వరని అన్నారు. సొంత కార్యకర్త కారు కిందపడి చనిపోతే పక్కన పడేసి వెళ్లిపోయారని అన్నారు. దీనిని అందరూ గమనించాలని, కష్టపడి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. సమావేశం అనంతరం టీడీపీ కార్యకర్తలను కలిసి అర్జీలు స్వీకరించారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జోనల్ కో-ఆర్డినేటర్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.



మహిళలు, చిన్నారుల కోలాహలం.



మంత్రి లోకేశ్‌కు హారతులు



అందరికీ అభివాదం..



మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు

## కూటమిలో బీసీలకు పెద్దపీట

- కనకదాస జయంతికి శాశ్వత జీవో
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



కళ్యాణదుర్గంలో భక్త కనకదాస జయంతి, విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

అనంతపురం/కళ్యాణదుర్గం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బీసీల పక్షపాతి అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న భక్త కనకదాస జయంతి వేడుకలు, విగ్రహావిష్కరణ ఏర్పాట్లను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాతే బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కిందని అన్నారు. కురుబలకు అన్ని రంగాల్లోను అవకాశం కల్పించింది టీడీపీ ప్రభుత్వంలోనే అని, గతంలో తన తండ్రి ఎస్ రామచంద్రారెడ్డికి మంత్రిగా, ఎంపీగా, టీటీడీ బోర్డు సభ్యుడిగా అవకాశం కల్పించారని గుర్తు చేశారు. బీకే పార్థసారథికి ఎంపీగా, ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్‌గా అవకాశం కల్పించారని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే కురుబ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, తనకు చైర్ పర్సన్‌గా అవకాశం కల్పించారని అన్నారు. గత ఎన్నికల్లో ఇద్దరు కురబ నేతలకు ఎంపీలుగా, తనకు ఎమ్మెల్యేగా టిక్కెట్ ఇచ్చారని, గెలిచాక మంత్రిగా కూడా తనకు అవకాశం కల్పించింది టీడీపీనే అని అన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస విగ్రహాన్ని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఏర్పాటు చేయించడం హర్షణీయమని అన్నారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా కనకదాసు విగ్రహావిష్కరణ శుక్రవారం జరుగుతుందని తెలిపారు. త్వరలో అన్ని కార్పొరేషన్లకు నిధులు కేటాయిస్తామని, ప్రతి ఒక్కరినీ వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యమని అన్నారు. ఆదరణ-3 పథకం కింద కులవృత్తుల ప్రోత్సహిస్తామని తెలిపారు. కురుబ కులస్థులు చిరకాలంగా ఎదురుచూస్తున్న భక్త కనకదాసు జయంతిని అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించడానికి శాశ్వత జీవోను కూడా శుక్రవారం విడుదల చేశామని మంత్రి తెలిపారు. శాశ్వత జీవో తెస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ నెరవేరిందని అన్నారు. శాశ్వత జీవో ఇచ్చినందుకు మంత్రి నారా లోకేశ్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి కురుబ కులస్థుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా గుడికట్ల పూజారుల గౌరవ వేతనం, ధూప దీప నైవేద్యాలకు నెలకు రూ.7 వేలు అందజేయబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సత్యనారాయణ, ఆ శాఖ జిల్లా అధికారి కుష్బూ కొఠారి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకర జీవన శైలితో క్యాన్సర్ దూరం

- వైద్యవిద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్, సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం

అనంతపురం వైద్యం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రసాయన సమ్మిళిత ఆహారాన్ని భుజించకపోవడం, వ్యసనాలకు దూరంగా ఉండడం, శరీరానికి శ్రమను పెంచడం వంటి ఆరోగ్యకరమైన జీవన శైలితోనే క్యాన్సర్‌కు దూరంగా ఉండవచ్చని ప్రభుత్వ వైద్యవిద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం రేడియేషన్ అంకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ ప్రశాంతి అధ్వర్యంలో క్యాన్సపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శంకర్, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం ర్యాలీని ప్రారంభించి, మాట్లాడారు. క్యాన్సర్ పరీక్షలు చేసేందుకు ఓపీ 222 ఏర్పాటు చేశామన్నారు. ఓపీ 6లో పాప్‌స్మియర్ పరీక్షలుచేసి గర్భాశయ క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సరళ, సుచిత్ర, అసోసియేట్స్ నటేష్, మాధవీలత, సాయిరాణి, అసిస్టెంట్స్ సుష్మ, శ్రీనివాసరావు, నాగప్రవీణ్, గీతాంజలి, కుష్బూ, ఎన్ఎస్ఎస్ పీఓలు సుమన గోపీచంద్, లలిత, పరదేశినాయుడు, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

### ఇంటింటా క్యాన్సర్ స్ర్కీనింగ్...

ఇంటింటా క్యాన్సర్ స్ర్కీనింగ్ కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబీ దేవి పేర్కొన్నారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి తెలుగు తల్లి విగ్రహం వరకు సాగిన ర్యాలీని ఆమె ప్రారంభించి, మాట్లాడారు. క్యాన్సర్ లక్షణాలు, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జయలక్ష్మి, డీఎంఓ ఓబులు, డెమో నాగరాజు, హెచ్‌ఈఓ త్యాగరాజు, పీఎంఓ నాగన్న, డిప్యూటీ హెచ్‌ఈఓ గంగాధర్ పాల్గొన్నారు.

## భూముల పరిశీలన



తలారిచెరువు వద్ద భూమిని పరిశీలిస్తున్న దృశ్యం

తాడిపత్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలారిచెరువు, బోగసముద్రం గ్రామాల పరిధిలో టిష్యూ కల్చర్ విధానంలో అరటి మొక్కల ఉత్పత్తి, పరిశోధన కేంద్రం ఏర్పాటుకు భూములను జిల్లా ఉద్యాన అధికారి ఉమాదేవి ఆధ్వర్యంలో టీటీఎస్ఎస్ఎల్ ఎండీ చేతన్‌జోష్, గ్లోబుల్ అగ్రి సిస్టం ప్రైవేటు లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ శ్రీవాత్సవ్ శుక్రవారం పరిశీలించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్‌రెడ్డి, సర్వేయర్ రాంమోహన్, ఏడీహెచ్ దేవానంద్, హార్టికల్చర్ ఆఫీసర్ ఉమాదేవితో కలిసి మూడు చోట్ల భూములను పరిశీలించారు. రెండ్రోజుల్లో వాటిని సర్వేచేసి నివేదికలు పంపిస్తామని అధికారులు తెలిపారు.

## గ్రామీణులకు మెరుగైన సేవలే లక్ష్యం

- ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నిరంజన్ రెడ్డి




ఐఎంఏ నూతన కమిటీ సభ్యులు

అనంతపురం వైద్యం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నిరంజన్ రెడ్డి తెలిపారు. స్థానిక వైద్య కళాశాలలోని ఐఎంఏ హాల్‌లో శుక్రవారం ఐఎంఏ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. డాక్టర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక దృక్పథంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడమే ఐఎంఏ లక్ష్యమన్నారు. ఇటీవ నిర్వహించిన కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా తనను, ప్రధాన కార్యదర్శిగా ఫణిమహేష్‌రెడ్డి, ట్రెజరర్‌గా అంజనీకుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, చంద్రమోహన్, సుప్రజా చౌదరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మనోరంజన్‌రెడ్డితోపాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

# తడిసెడు కష్టాలు..!

**వర్షంలో తడిసి ముద్దయిన వేరుశనగ కాయలు, కట్టె**

**అంతంత మాత్రం దిగుబడితో రైతుల ఇబ్బందులు**

**గ్రాసం కూడా దక్కదని ఆవేదన**



వానలో నానిన వేరుశనగ కట్టె

తాడిపత్రి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు, తెగుళ్లతో వేరుశనగ రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. జిల్లాలో ఎక్కువగా మెట్ట భూముల్లో వర్షాధారంగా వేరుశనగ సాగు చేస్తున్నారు. ఇలా ఏడాదికి ఒక పంట దిగుబడితో వచ్చిన ఆదాయంతో సంవత్సరం పొడవునా కుటుంబాన్ని పోషించుకుంటాడు. దిగుబడి రాని ఏడాది అప్పులతో నెట్టుకురావాల్సిన పరిస్థితిని కొన్నేళ్లుగా జిల్లా రైతాంగం ఎదుర్కొంటోంది. వరుసగా కరువులు వస్తే మాత్రం చేసిన అప్పులు తీర్చలేక కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం పరిపాటిగా మారింది.

### వేల ఎకరాల్లో సాగు



నానిన వేరుశనగ కాయలు

నియోజవర్గంలోని తాడిపత్రి మండలంలో 1100ఎకరాలు, పెద్దపప్పూరు 2119, యాడికి 2400, పెద్దవడుగూరు 1800ఎకరాల్లో ఈ ఏడాది వేరుశనగ సాగుచేశారు. కొంతమంది కౌలురైతులు కూడా వేరుశనగ సాగుచేశారు. విత్తనం సమయంలో తడిపొడి వర్షంతో పంట సాగుచేశారు. ఎకరాకు నాలుగైదు బస్తా( బస్తా 42కిలోలు)ల దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. పెట్టుబడి దాదాపు రూ.25వేల నుంచి 30వేలు పెట్టినట్లు పేర్కొన్నారు. పంట దిగుబడి, ధర బాగా ఉన్నట్లయితే పెట్టుబడులు పోయి ఎకరాకు రూ.15 వేల నుంచి 20వేలు మిగులుతుండేది. కానీ ఈ సంవత్సరం పెట్టుబడి కూడా చేతికి అందే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. నాణ్యత ఉన్న వేరుశనగ కాయలను బస్తా రూ.2800 నుంచి 3200 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కానీ ఇటీవల తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు తడిసిన వేరుశనగ కాయలకు ఎంత రేటు వస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొందని పలువురు రైతులు పేర్కొన్నారు. వర్షం వల్ల పశువుల మేత కూడా నష్టపోయినట్లు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి వేరుశనగ కట్టె, కాయలు పూర్తిగా నాని ముద్ద అయ్యాయని రైతులు వాపోయారు. వర్షం ఉన్నట్లుండి రావడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉండిపోయామని రైతులు ఆవేదన చెందారు.



వేరుశనగ వామి చుట్టూ వాన నీరు

### వర్షంతో తీవ్రనష్టం : మహబూబ్‌బాషా, రైతు, చీమలవాగుపల్లి



నాకున్న ఐదు ఎకరాలతోపాటు 15ఎకరాలు కౌలుకు తీసుకొని మొత్తం 20ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశా. ఇటీవల తుఫాన్ వల్ల వచ్చిన వానతో కొంతమేరకు వేరుశనగ కట్టె, కాయలు దెబ్బతిన్నాయి. కానీ బుధవారం కురిసిన వర్షానికి కొంత భాగం పంట నిట్టనిలువునా వర్షంలో తడిసి ముద్ద అయ్యింది. రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి, ఆదుకోవాలి.

### తెరిపి ఇవ్వడంతో కాయలు ఆరబెట్టాం: రసూల్, రైతు



మాకున్న 5ఎకరాలు సాగుచేశాం. కొంతభాగంలో వేరుశనగ కాయలు విడిపించి ఆరబెట్టాం. గత వారం రోజులుగా తుఫాన్ వల్ల ఆకాశం ముసురు వేసి ఉండటంతో ఎండలేక కాయలు ఆరలేదు. అయితేఏ రెండు రోజులుగా తెరిపి ఇవ్వడంతో కాయలను ఆరబెట్టాం. కానీ హఠాత్తుగా వచ్చిన భారీ వర్షం వల్ల వేరుశనగ కాయలు మొత్తం తడిసిపోయాయి.

# కొనేవారేరీ..?

**అరకొరగా వేరుశనగ దిగుబడి**

**కొనేవారి కోసం రైతుల నిరీక్షణ**

**ధర లేక అన్నదాతల అగచాట్లు**



తక్కువ ధరకే వేరుశనగ కాయలు అమ్ముతున్న రైతులు

శింగనమల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వేరుశనగ రైతులకు ఖరీఫ్ సీజన్ యథా ప్రకారం నష్టాలనే మిగిల్చింది. తీవ్ర వర్షాభావంతో అరకొరగా పండిన దిగుబడిని కూడా కొనే నాథుడు లేక రైతులు పొలాల్లోనే ఆరబోసుకుంటున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 2 వేల ఎకరాలకుపైబడి వేరుశనగ సాగు చేశారు. కే6, లేపాక్షి 10, 12 రకాలు సాగు చేశారు. ఎకరానికి రూ.30వేలు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. తొలుత వర్షాలు ఆశాజనకంగా ఉండటంతో పైరు ఏపుగా పెరిగింది. అయితే భూమిలో కాయలు ఏర్పడే దశలో వర్షాభావం వెంటాడింది. దీంతో విత్తనం పూర్తి స్థాయిలో ఏర్పడక కాయలు అవటను తగ్గాయని రైతులు వాపోతున్నారు. ఇటీవల మొంథా తుఫాను నేపథ్యంలో కురిసిన వర్షాలకు కాయలు మొలకెత్తుతున్నాయని పంటను తొలగించారు. పంట నూర్పిడి తర్వాత 47 కిలోల బస్తాను వ్యాపారులు రూ.2400 ధరకు అడుగుతున్నారని, ఈ ధరతో ఏమాత్రం గిట్టుబాటు కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు ధర కోసం వేరుశనగ కాయలను కళ్లాల్లో రాశులు పోసి ఎదురు చూస్తున్నారు.

### నష్టపోతున్నాం: కాయల వెంకటనారాయణ



గత పదేళ్ల నుంచి మాప్రాంతంలో వేరుశనగ పంట దిగుబడులు కనీసం పెట్టుబడులకైనా వచ్చేవి. ఈ ఏడాది నేను మూడు ఎకరాల సాగుకు రూ.90 వేలకుపైగా పెట్టుబడులు పెట్టా. పంట కాయల దశలో వాన రాకపోవడంతో దిగుబడులు తగ్గాయి. ఎకరానికి నాలుగు ఐదు బస్తాలే రావడంతో నాకు రూ.40 వేలు నష్టం వాటిల్లింది.

### ఎవరు కోనుగోలు చేస్తారో?



మేము నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాం. రూ.1.5లక్షల దాకా పెట్టుబడి పెట్టాం. విత్తనం బలిసే సమయంలో వాన లేక దిగుబడి తగ్గిపోయింది ఎకరానికి నాలుగైదు బస్తాలే దిగుబడి వచ్చింది. వాటిని కొనడానికి కూడా వ్యాపారులు ముందుకు రావడం లేదు.

\- మహిళా రైతు నాగలక్ష్మమ్మ, పెద్దమట్లగొంది

### ఎకరాకి నాలుగు బస్తాలే..



మేము ఆరు ఎకరాలు వేరుశనగ పంట సాగు చేశాం. పంట సాగు కోసం రూ.2.5లక్షలు ఖర్చు చేశాం. వర్షాలు రాకపోవడంతోపాటు మొంథా తుఫాన్‌తో దిగుబడులు ఎకరానికి నాలుగు బస్తాలు మాత్రమే వచ్చాయి. ధరలేని ప్రస్తుత పరిస్థుతుల్లో ఈ దిగుబడితో ఎలా బతికేది? ప్రభుత్వమైన పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి.

-ఆదిలక్ష్మి, మహిళా రైతు, పెద్దమట్లగొంది

## క్రైం కార్నర్

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


విజయరాజు (ఫైల్)

గుత్తి రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):మండలంలోని బేతాపల్లికి చెం దిన విజయరాజు (25).. కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మరణించాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బేతాపల్లికి చెందిన చిట్టి బాబు, రామంజినమ్మ దంపతుల కుమారుడు విజయరాజు. బైక్‌పై కర్నూలు జిల్లా డోన్‌కు బయల్దేరాడు. డోన్ మండలం కొత్తపల్లి శివారులో 44వ నంబరు జాతీయ రహదారిపై లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన విజయరాజును స్థానికులు డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రమాదంపై డోన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

### విద్యుత్‌తీగ మీదపడి వృద్ధుడు..

యల్లనూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురం గ్రా మంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌తీగ మీదపడడంతో శుక్రవారం సుబ్బరాయుడు (72) మృతిచెందాడు. హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుబ్బరాయుడు ఇంటిముందు ఉన్న చెట్టు కొమ్మలను కొట్టివేస్తుండగా విద్యుత్‌వైరుపై కొమ్మ విరిగిపడింది. విద్యుత్ సరఫరా ఉన్న వైరు సుబ్బరాయుడుపై పడడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. సుబ్బరాయుడుకు భార్య రమణమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

### యువకుడి ఆత్మహత్య


వేణురంగనాయకులు (ఫైల్)

తాడిపత్రి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని యల్లనూరు రైల్వేగేట్ వద్ద శుక్రవారం వేణురంగనాయకులు (19) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపారు. యల్లనూరు మండలం చిలమకూరు గ్రామానికి చెందిన కృష్ణాంజనేయులు, రమణమ్మ దంపతుల పెద్ద కుమారుడు వేణురంగనాయకులు అర్జాస్‌స్టీల్ ప్లాంట్‌లో కార్మికుడిగా విధులు నిర్వర్తించేవాడు. రోజు చిలమకూరు నుంచి ప్లాంట్‌కు వచ్చి వెళుతుండేవాడు. గత కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఆస్పత్రుల్లో చూపించినా ప్రయోజనం లేకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

# విధుల్లోనూ క్రీడా స్ఫూర్తి చాటండి

(5వ పేజీ తరువాయి)

నిర్వహించడం అభినందనీయమ న్నారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి 27జట్లుగా రావడం సంతోషకరమన్నారు. ఈ పోటీలు టీం వర్క్‌కి ప్రతీకగా నిలుస్తాయన్నారు. అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు అనంతపురం వేదిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సమష్టిగా క్రీడాపోటీల విజయవంతానికి కృషి చేయాలన్నారు. ప్రతి నిత్యం పని ఒత్తిడిలో ఉండే రెవెన్యూ ఉద్యోగులకు ఆటవిడుపుగా క్రీడా పోటీలు దోహదం చేస్తాయన్నారు. ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆరు సార్లు రెవెన్యూ క్రీడాపోటీలు నిర్వహించామని, గతం కంటే ఘనంగా పోటీలు అనంతపురంలో నిర్వహించడం ఎంతో గొప్ప అనుభూతిని ఇస్తోందన్నారు. క్రీడలు సమయపాలన, ఐక్యత, బాధ్యతకు దోహదం చేస్తాయని తెలిపారు. అనంతరం నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో కాకినాడ జిల్లా మొదటి స్థానం, అనంతపురం ద్వితీయ స్థానం, తూర్పుగోదావరి తృతీయ స్థానంలో నిలిచాయి. అక్కడే ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్లు శివనారాయణ శర్మ, మౌర్య భరద్వాజ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓలు మలోలా, సూర్యనారాయణ రెడ్డి, ఎఫ్‌ఎస్‌ఓ రామకృష్ణా రెడ్డి, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరాజేష్, ఆర్డీఓలు కేశవనాయుడు, ఆనంద్‌కుమార్, శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, మల్లికార్జునరెడ్డి, రామ్మోహన్, మల్లికార్జునుడు, రమేష్‌రెడ్డి తిప్పేనాయక్, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ త్రినాథరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, జీవన్‌చంద్ర, శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షుడు దివాకర్‌బాబు, తెలంగాణ, ఏపీ ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న అనంతపురం రెవెన్యూ ఉద్యోగులు

### ఉత్సాహంగా... ఉల్లాసంగా పోటీలు

ఏడో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతికోత్సవాలు ఉత్సాహం... ఉల్లాసంగా సాగాయి. వాలీబాల్ పోటీల్లో మొదటి రౌండ్‌లో పశ్చిమగోదావరిపై ఎన్టీఆర్ కృష్ణా జిల్లా, పార్వతీపురంపై పల్నాడు, ఏలూరుపై అనకాపల్లి, తిరుపతిపై నంద్యాల, కడపపై అల్లూరి సీతారామరాజు, ప్రకాశంపై బాపట్ల, చిత్తూరుపై తూర్పుగోదావరి, శ్రీసత్యసాయిపై గుంటూరు, కర్నూలుపై అన్నమయ్య జట్లు విజయం సాధించాయి.

- కబడ్డీలో తిరుపతిపై పార్వతీపురం, నంద్యాలపై చిత్తూరు, పశ్చిమగోదావరిపై గుంటూరు, కర్నూలుపై శ్రీకాకుళం, కాకినాడపై తూర్పుగోదావరి, నెల్లూరుపై అనంతపురం జట్టు, అల్లూరి సీతారామరాజు జట్టుపై విశాఖపట్నం, ఎన్టీఆర్ జిల్లాపై బాపట్ల, కడప జిల్లాపై అన్నమయ్య జట్లు విజయం సాధించి రెండో రౌండ్‌కి అర్హత సాధించాయి.
- త్రోబాల్‌లో బాపట్లపై కడప, సీసీఎల్‌ఏ జట్టుపై పార్వతీపురం, గుంటూరుపై అనకాపల్లి, శ్రీసత్యసాయిజిల్లాపై నంద్యాల జట్లు విజయం సాధించాయి.
- బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్‌లో పల్నాడుపై విజయనగరం, తూర్పుగోదావరిపై చిత్తూరు, నంద్యాలపై విశాఖపట్నం జట్లు గెలుపొందాయి.
- బ్యాడ్మింటన్ పురుషుల పోటీలో పశ్చిమగోదావరిపై అనకాపల్లి, ప్రకాశంపై నెల్లూరు, అల్లూరు సీతారామరాజు జట్టుపై కడప, ఎన్టీఆర్ జిల్లాపై కాకినాడ విజయం సాధించాయి.
- టెన్నికాయిట్ మహిళల పోటీల్లో శ్రీకాకుళంపై బాపట్ల, నంద్యాలపై కడప, ప్రకాశంపై గుంటూరు, నంద్యాల-45పై అనంతపురం-45, తిరుపతిపై చిత్తూరు, శ్రీకాకుళంపై నెల్లూరు జట్లు గెలుపొందాయి.
- క్యారమ్స్‌లో ఏలూరుపై నంద్యాల, అనంతపురంపై పార్వతీపురం, తూర్పుగోదావరిపై కర్నూలు, ఎన్టీఆర్ జిల్లాపై నెల్లూరు, కడపపై పల్నాడు జట్లు విజయం సాధించాయి.
- టేబుల్‌టెన్నిస్ మహిళల విభాగంలో విశాఖపట్నంపై కర్నూలు, పశ్చిమగోదావరిపై కడప, బాపట్లపై అనంతపురం, చిత్తూరు పై కాకినాడ జట్లు గెలుపొందాయి.
- చెస్ పురుషుల విభాగంలో తిరుపతిపై విజయనగరం, పల్నాడుపై నెల్లూరు జట్లు గెలుపొందాయి. మహిళల విభాగంలో తిరుపతిపై విజయనగరం, నెల్లూరుపై పల్నాడు, చిత్తూరుపై తూర్పుగోదావరి, కర్నూలుపై విశాఖపట్నం జట్లు గెలుపొందాయి.
- టేబుల్‌టెన్నిస్ పురుషుల విభాగంలో తూర్పుగోదావరిపై అనంతపురం ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి గెలుపొందారు.


రెవెన్యూ క్రీడాజ్యోతితో మైదానంలో పరుగు


వాలీబాల్ ఆడుతున్న కలెక్టర్ ఆనంద్


కబడ్డీ పోటీల్లో ఆర్డీఓ మలోల

## రద్దీకి తగ్గట్టుగా బస్సులు

- ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు


పుట్టపర్తి డిపోలో కార్మికులతో మాట్లాడుతున్న చైర్మన్ పూలనాగరాజు

పుట్టపర్తి టౌన్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా పుట్టపర్తికి వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని జోనల్ చైర్మన్ పూల నాగరాజు అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం పుట్టపర్తి ఆర్టీసీ డిపో, బస్టాండ్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. డిపోలో ఆర్టీసీ కార్మికులకు అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సత్యసాయి శత జయంతికి దేశవిదేశాల నుంచి బాబా భక్తులు, ప్రజలు లక్షలాదిగా పుట్టపర్తికి వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకు తగ్గట్టు ఆర్టీసీ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బస్టాండ్, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీటీఓ ముధుసూదన్, డిపో మేనేజర్ ఇనయతుల్లా, సూపర్‌వైజర్లు హరిత, విజయానంద, షాషావలి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమోషన్లు ఇప్పించాలని వినతి


పట్టాభికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

పుట్టపర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన వారందరికీ ప్రమోషన్ ఇచ్చేలా చొరవ చూపాలని సచివాలయ ఉద్యోగులు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభికి వినతి పత్రం అందజేశారు. పుట్టపర్తికి వచ్చిన ఆయన్ను సచివాలయ ఉద్యోగులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ కార్యదర్శులకు ఉన్న అనుబంధ శాఖలైన ఫుడ్ సేఫ్టీని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు లేదా మెడికల్ హెల్త్ శాఖలో కలిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నత విద్యను అభ్యసించిన సచివాలయ ఉద్యోగుల నైపుణ్యాలను సక్రమంగా వినియోగించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి సచివాలయ ఉద్యోగ నాయకులు భాస్కర్ రెడ్డి, మోహన్ కుమార్, నరసింహులు, రాజేష్, రాజశేఖర్ రెడ్డి, మారుతి, మదన్ ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఇద్దరి జీవితాల్లో వెలుగులు


జయప్ప (ఫైల్)

ధర్మవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్ చెందిన జయప్ప(61) నేత్రాలను దానం చేయడం ద్వారా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపారు. జయప్ప శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. విశ్వదీప సేవాసంఘం సభ్యులు.. ఆయన కుటుంబసభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకారం మేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జయప్ప నేత్రాలను సేకరించారు. జయప్ప కుటుంబికులను అభినందించారు.

## విశాఖపై అనంత జట్టు విజయం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ క్రీడాపోటీల్లో భాగంగా క్రికెట్ మ్యాచ్‌లో విశాఖపట్నం జట్టుపై అనంతపురం 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన విశాఖపట్నం 18.4 ఓవర్లలో 100 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బరిలోకి దిగిన అనంతపురం జట్టు 16.5 ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. జేసీ శివనారాయణ శర్మ (22), ఓబులేసు (32), ఆకాష్ (29) రాణించారు. అనంత బౌలర్లు వినయ్ 4, వివేక్, అఖిల్ చెరో రెండు వికెట్లు తీశారు. విజేత జట్టును కలెక్టర్ ఆనంద్ అభినందించారు. సాయంత్రం నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


గెలుపొందిన జిల్లా క్రికెట్ జట్టును అభినందిస్తున్న కలెక్టర్ ఆనంద్

## ఘనంగా హాకీ వందేళ్ల వేడుకలు


హాకీ విజేత ఆర్ట్స్ కళాశాల బాలుర జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భారతదేశ జాతీయ క్రీడ హాకీ వందేళ్ల వేడుకలు ఘనంగా నిర్వహించారు. హాకీ అనంతపురం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. బాల, బాలికల విభాగాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్ హాకీ క్రీడాకారులను సత్కరించారు. కార్యక్రమంలో హాకీ అనంతపురం ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, సహాయ కార్యదర్శి అక్రమ్ బాషా, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మీరు వెళ్లడానికి వీల్లేదు..!

- పుట్టపర్తిలో ప్రొటోకాల్ గొడవ

పుట్టపర్తి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఏపీ మాంసాభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాష్ నాయుడు, పోలీసుల మధ్య ప్రొటోకాల్ గొడవ జరిగింది. అనంతపురం జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం పుట్టపర్తి విమానాశ్రయానికి వస్తున్న మంత్రి నారా లోకేశ్‌కు స్వాగతం పలికేందుకు ప్రకాష్‌నాయుడు వచ్చారు. అయితే విమానాశ్రయంలో స్వాగతం పలికే వ్యక్తుల జాబితాలో పేరులేకపోవడంతో ప్రకాష్ నాయుడును పోలీసులు అనుమతించలేదు. దీంతో ప్రకాష్ నాయుడు, పోలీసుల మధ్య మాటామాటా పెరిగింది. అయితే అక్కడే ఉన్న పుట్టపర్తి డీఎస్పీ జోక్యం చేసుకుని విమానాశ్రయంలోకి ప్రకాష్ నాయుడును అనుమతించడంతో వివాదం సద్దుమణిగింది. ప్రొటోకాల్ జాబితాలో ప్రకాష్ నాయుడు పేరు చేర్చాల్సి ఉన్నా, చేర్చకపోవడం వల్లే వివాదం ఏర్పడినట్లు సమాచారం.

## మైనింగ్ ప్రాంతంలో రాడార్ సర్వే


రాడార్ సర్వే చేపడుతున్న అధికారులు

డీ.హీరేహాళ్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సరిహద్దులోని వివాదాస్పద మైనింగ్ ప్రాంతాల్లో రాడార్ సర్వే జరుగుతోంది. గత పదిరోజులుగా రెవెన్యూ, అటవీశాఖ, మైనింగ్, ఇతర శాఖల అధికారులు సర్వే ఆఫ్ ఇండియా బృందంతో కలిసి ఈ సర్వే ప్రక్రియ నిర్వహిస్తున్నారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి ఓఎంసీ, వైఎం మైనింగ్ ప్రాంతాలలో శుక్రవారం సర్వే చేపట్టారు. ఈ సర్వే ప్రక్రియలో భాగంగా మొదట జీపీఎస్ పాయింట్లు గుర్తించారు. అనంతరం డ్రోన్లతో సర్వే చేపట్టారు. రెండురోజులుగా రాడార్ సర్వే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. సుమారు 250 ఎకరాలు సర్వే చేశారు. మూడు మైనింగ్ కంపెనీలలో సరిహద్దులను సర్వే చేశారు. ఈ సర్వేలో డీఎఫ్ఓ సోషల్ ఫారెస్ట్ ఆఫీసర్ గురుప్రభాకర్, మైన్స్ అండ్ జియాలజీ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సర్వేయర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రీ..ఫ్రీ..ఫ్రీ

### కారు డ్రైవింగ్‌లో శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో ఈనెల 20 నుంచి డిసెంబరు 19 వరకు మహిళలకు కారు డ్రైవింగ్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. 18-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి రేషన్, ఆధార్‌కార్డు కలిగిన ఉమ్మడి జిల్లా నిరుద్యోగులు అర్హులన్నారు. 30రోజుల పాటు సాగే శిక్షణా కాలంలో భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు ఎస్‌కేయూ సమీపంలోని రూడ్‌సెట్ కార్యాలయలో నేరుగా లేదా సెల్ నంబరు 9492583484ను సంప్రదించాలని కోరారు.

### ట్యాలీ కోర్సులో..

నిరుద్యోగ యువతకు కంప్యూటర్ ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఉన్నతి ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదివి 18-28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ ఉంటుందన్నారు. ఈనెల 10 నుంచి 60రోజుల పాటు ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీసెంటర్‌లో నిర్వహించే శిక్షణలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఆయా సంస్థలలో ఉద్యోగ అవకాశం కల్పిసామని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 9000487423ను సంప్రదించాలని కోరారు.

### గ్యాస్ కనెక్షన్‌కు..

పుట్టపర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద ఉచిత గ్యాస్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఎల్పీజీ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజీవ్ దేవ్ కోరారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అవసరమైన వారు జిల్లాలో ఆయా గ్యాస్ డీలర్ల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. అయితే గ్యాస్ కనెక్షన్ ఉన్నవారికి ఇది వర్తించదన్నారు. దరఖాస్తుదారులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, లబ్ధిదారుడి బ్యాంకు అకౌంటు పుస్తకం, కులధ్రువీకరణ పత్రం, రెండు కలర్ ఫొటోలు గ్యాస్ ఆఫీసులో ఇచ్చి, పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

### చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16,100తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 23టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

### టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో శుక్రవారం టామోటాలు కిలో గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9తో, సరసరిగా రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2100 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

## రెజ్లింగ్‌లో జిల్లాకు పతకాల పంట


పతకాలు సాధించిన వారిని అభినందిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లాకు పతకాల పంట పండింది. ఈనెల నాలుగు నుంచి ఆరో తేదీ వరకు విజయవాడలో జరిగిన ఎస్‌జీఎఫ్‌రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. బాలికల్లో లావణ్య, అనూషా, యశస్విని, లాస్యరెడ్డి, మందార, విష్ణు, ప్రియ, కావ్యశ్రీలు పతకాలు సాధించారు. బాలురలో రాకీ, రోహిత్, రాజేష్, కార్తీక్, దిలీప్, భరత్, ప్రేమ్‌సాగర్, దుర్గాప్రసాద్, జస్వంత్, ప్రభాస్, రుషివర్ధన్‌లు విజేతలుగా నిలిచారు. విజేతలను శుక్రవారం డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ మునీర్‌లు అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, కోచ్‌లు మల్లికార్జున, శర్మాస్, శ్రీనివాసులు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## గీతారెడ్డి అదుర్స్

- జాతీయస్థాయి పోస్టర్ పెయింటింగ్‌లో విజేతగా ఆవిర్భావం


రష్యా శాస్త్రవేత్త నుంచి అవార్డు అందుకుంటున్న గీతారెడ్డి

కణేకల్లు/అనంతపురం విద్య, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో 'అంతరిక్ష శాస్త్రం, ప్రపంచస్థాయి అధ్యయన అవకాశం' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయస్థాయి పోటీల్లో మండలంలోని హనకనహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని గీతారెడ్డి సత్తాచాటింది. పోస్టర్ పెయింటింగ్‌లో జాతీయస్థాయిలో మొదటి బహుమతి కైవసం చేసుకుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం ఢిల్లీలోని ఇండో-రష్యా అంతరిక్ష పరిశోధన కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో గీతారెడ్డి విజేతగా నిలిచి రష్యన్ శాస్త్రవేత్త నుంచి అవార్డు అందుకుందన్నారు. డీఈఓ ప్రసాద్ బాబు, ఏపీసీ శైలజ, సైన్స్‌సెంటర్ అధికారి బాలమురళి విద్యార్థిని అభినందించారు.

## ఏపీఐఐసీ డైరెక్టర్‌గా 'చల్లా'


డైరెక్టర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఇతర డైరెక్టర్లు, నాయకులు

అనంతపురం క్రైం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ రాష్ట్ర డైరెక్టర్‌గా చల్లా లక్ష్మీప్రసాద్ బాబును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏపీఐఐసీకి సంబంధించి 15 మంది డైరెక్టర్లను నియమిస్తూ జీవో 189 విడుదల చేసింది. ఈ క్రమంలో అనంతపురానికి చెందిన చల్లా లక్ష్మీప్రసాద్ బాబుకు కూడా ఏపీఐఐసీ డైరెక్టర్‌గా అవకాశం దొరికిందింది. దీంతో పలువురు డైరెక్టర్లు పోతుల లక్ష్మీ నరసింహులు, పరమేష్, టీడీపీ నాయకులు కురుబ నారాయణస్వామి, తిరుపాల్, అరుణ్ మరికొందరు డైరెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

- ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ జెస్సీ

గుంతకల్లుటౌన్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ జెస్సీ పేర్కొన్నారు. స్థానిక శ్రీ శంకరానంద గిరిస్వామి డిగ్రీ కళాశాలలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ అంతర్ కళాశాలల పురుషుల గ్రూప్ సీ క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొని సత్తా చాటాలన్నారు. ఖోఖో పోటీల్లో శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రన్నరప్‌గా నిలచింది. ఫుట్‌బాల్ పోటీలో పుట్టపర్తి మంగళకర కళాశాల విజేతగా నిలవగా, అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రన్నరప్‌తో సరిపెట్టుకుంది. హ్యాండ్‌బాల్ పోటీల్లో రాయదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విజేతగా, అనంతపురం ఆర్ట్స్ కళాశాల రన్నరప్‌గా నిలచింది. రగ్బీలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం జట్టు విజేతగా, అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల రన్నర్‌ఎగా నిలిచాయి. సెపక్ తక్రా పోటీల్లో పుట్టపర్తి మంగళకర డిగ్రీ కళాశాల విజేతగా, గుంతకల్లు ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రన్నర్‌ఎగా నిలిచాయి. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మస్తానప్ప, పీడీలు మహబూబ్ బాషా, శ్రీరామ్, జయలక్ష్మి, రాజేష్, వీరేష్, సురేష్ పాల్గొన్నారు.


విజేతకు ట్రోఫీని అందజేస్తున్న డాక్టర్ జెస్సీ

# సంగ్రామ గేయం.. వందేమాతరం..



ధర్మవరంలో మాట్లాడుతున్న ఎంఈఓ గోపాల్‌నాయక్, ముదిగుబ్బలో వందేమాతరం ఆలపిస్తున్న విద్యార్థులు

ధర్మవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సంగ్రామంలో వందేమాతర గేయం ప్రజలందరినీ ఒకేతాటిపైకి తీసుకు వచ్చిందని ఎంఈఓ గోపాల్‌నాయక్ తెలిపారు. వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా విద్యార్థులతో కలిసి శుక్రవారం వందేమాతరగేయం ఆలపించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. వందేమాతరంగీతం భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రజల్లో స్ఫూర్తి నింపిందన్నారు. ఉద్యమానికి గొప్ప ప్రేరణగా నిలిచిందన్నారు. కార్యక్రమం లో ఎమ్మార్సీ సిబ్బంది, సూర్య స్కూల్ కరస్పాండెంట్ నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు. కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వందేమాతర గీతాలాపన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గోపాల్‌నాయక్, అధ్యాపకులు కిరణ్‌కుమార్, షమీవుల్లా, పావని, పుష్పావతి, సరస్వతి, ఆనంద్, ధనుంజయ పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర హైస్కూల్‌లో వందేమాతరం గీతాలాపన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... వందేమాతరం గేయం రచించిన ప్రముఖ బెంగాలీ రచయిత బంకింగ్ చంద్ర ఛటర్జీ గురించి, స్వతంత్ర్య ఉద్యమంలో ఈ గేయం ఇచ్చిన స్ఫూర్తిని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్చార్జ్ తుమ్మల మనోహర్, ఎంఈవో వెంకట చలపతి, హెచ్‌ఎం రాఘవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు మనోహర్ పాఠశాలకు పది కుర్చీలను వితరణ చేశారు.

● తాడిమర్రి: స్థానిక ఉన్నతపాఠశాలలో విద్యార్థులచేత వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామ్మోహన్, గోపాల్‌రెడ్డి, పోతలయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

● గాండ్లపెంట : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాలలో వందేమాతరం గీతాలాపన చేశారు. గాండ్లపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య బృందం, నీరుగుంటపల్లి పాఠశాలలో బీజేపీ నాయకుడు అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు గీతాలాపన చేశారు.

# మంత్రి నారా లోకేశ్‌కు ఘన స్వాగతం



ధర్మవరంలో లోకేశ్‌తో కరచాలనం కోసం ఎగబడుతున్న అభిమానులు

ధర్మవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ధర్మవరంలో టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. కళ్యాణదుర్గం పర్యటనకు వెళుతూ.. శుక్రవారం సాయంత్రం ధర్మవరం చేరుకున్నారు. నియోజకవర్గంలోని మండలాల నుంచి వేలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు కాలేజ్‌సర్కిల్‌కు చేరుకున్నారు. ఆయన పుట్టపర్తి నుంచి ధర్మవరం చేరుకోవడంతో టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున చేరుకుని క్రేన్ ద్వారా గజమాలలతో సత్కరించారు. లోకేశ్‌ను చూడటానికి ప్రజలు మిద్దెలు, భవనాలపైకి ఎక్కారు. వారిని చూసిన లోకేశ్ అభివాదం చేశారు. టీడీపీ నాయకులు ఆయనకు చేనేత మగ్గం నమూనాను అందజేశారు. టీడీపీ నాయకులు, ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకుల వినతి పత్రాలు ఇచ్చారు. లోకేశ్‌ను సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసేందుకు ఎగపడ్డారు. అంతకు ముందు ఆయన కోసం మధ్యాహ్నం 2గంటల నుంచి నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావడంతో కాలేజ్ సర్కిల్ పసుపు మయంగా మారింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లి మహేశ్‌చౌదరి, పరిశే సుధాకర్, పణికుమార్, సంధారాఘవ, నాగూర్‌హుస్సేన్, భీమనేని ప్రసాద్‌నాయుడు, పురుషోత్తంగౌడ్, మాధవరెడ్డి, పెద్దన్న, షరీఫ్, పురుషోత్తం, ఆది, సనత్, లక్ష్మీనారాయణ, షాన్‌శేర్, బొట్టు కిష్ట, జింకల రాజన్న, సాయి, పల్లెం క్రిష్ణ, అస్లాం, రామాంజి, గోపాల్, సూరి, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే



వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి, మాజీమంత్రి రఘునాథరెడ్డి

పుట్టపర్తిరూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాగ్రీవెన్సుకు అనూహ్య స్పందన లభించింది. రెవిన్యూ, విద్యుత్, గృహాల మంజూరు, పింఛన్లు వంటి అంశాలపై ఎక్కువ మంది వినతి పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఒకే సమస్యపై అర్జీదారుడు పదేపదే కార్యాలయాలు చుట్టూ తిరగరాదని తెలిపారు. ప్రజాగ్రీవెన్సుకు వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. మాజీ మంత్రి పల్లె మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం ప్రజాగ్రీవెన్స్ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీకి అధికారులు వారంలోపు పరిష్కారం చూపాలని తెలిపారు. అనంతరం పల్లె క్యాంపు కార్యాలయానికి వచ్చిన స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాంకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాబా చిత్రపటాన్ని అందించి సన్మానించారు. బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పుట్టపర్తి పట్టణ అభివృద్ధికి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నుంచి తగిన నిధులను మంజూరు చేస్తామని పట్టాభిరాం తెలిపారు. కూరగాయల మార్కెట్ వేస్టును చెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేసే కేంద్రాన్ని మంజూరు చేస్తామన్నారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి మున్సిపాలిటీలో పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్‌కు సూచించారు. పుట్టపర్తిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మాజీమంత్రితో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, సామకోటి ఆదినారాయణ, గంగాధర్‌నాయుడు, పత్తి చంద్రశేఖర్, వలిపి శ్రీనివాసులు, కాలేనాయక్, శ్రీరాంరెడ్డి, విజయ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, జయచంద్ర, మల్లిరెడ్డి, రామకృష్ణ, మైలేశంకర్, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక




జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ధర్మవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలూరు వద్దగల రూపారాజ పీసీఎంఆర్ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్టు చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. ఈనెల 5న విజయవాడలో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో ప్రతిభ కనబరచి బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు కార్తీక్ బంగారు పతకం, దిలీప్ రజత పతకం, యశ్వంత్ కాంస్యపతకం సాధించి సత్తాచాటారని వివరించారు. త్వరలో ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొంటారని అన్నారు. విజేతలను శుక్రవారం డైరెక్టర్లు రూపా రాజ కృష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేశ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

● బుక్కపట్నం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా అండర్-17 బాలుర విభాగంలో అనంతపురం ఆర్డీటీ క్రీడామైదానంలో జరిగిన కబడ్డీ పోటీల్లో బుక్కపట్నం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్-17 లో కబడ్డీ తొమ్మిదో తరగతి చదువుతున్న యశ్వంత్ కుమార్, అయాన్, బలరాం ఎంపికయ్యారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం జగదీశ్వర్, పీడీ రామకృష్ణ, అభినందించారు.

## రాష్ట్రస్థాయి బ్యూటీ వెల్‌నెస్ పోటీలకు..



రాష్ట్రస్థాయికి ఎంపికయిన విద్యార్థినులు

కదిరి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు బ్యూటీవెల్‌నెస్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలం తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థినులు బ్రైడర్, పార్లల్ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈప్రాజెక్టు విద్యార్థినుల ప్రతిభ, ఆలోచనలను ప్రతిబింబిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల విద్యార్థినుల్లో నైపుణ్యం, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సామాజిక, వ్యక్తిగత అభివృద్ధి ఉద్యోగావకాశాలు పెంపొందిస్తుందన్నారు. ప్రాజెక్టులో ఆలీషా, దీశా, రోషినీ, పోతన కావ్య, ఎస్. రోషినీ, ఎస్. షమీరా, సన్నా ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

# మంత్రి లోకేశ్‌ను కలిసిన సంధా రాఘువ



నారా లోకేశ్‌తో కరచాలనం చేస్తున్న సంధా రాఘువ

ధర్మవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ధర్మవరం వచ్చిన సందర్భంగా ఆయనను చేనేత ప్రముఖుడు, టీడీపీ నాయకుడు సంధా రాఘవ కలిశారు. ఈ సందర్భంగా లోకేశ్ ఆయనను పలకరించి విజయవాడకు వచ్చి కలవమని చెప్పారు. సంధా రాఘవ రూ.25వేల విలువ చేసే కంచి పట్టుచీర, చేనేత మగ్గం నమూనాను లోకేశ్‌కు బహూకరించారు. నాలుగు మండలాల నుంచి వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సుమారు వెయ్యి మందికి ఆయన భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. క్రేన్ ద్వారా గజమాలతో లోకేశ్‌ను సత్కరించారు. ధర్మవరంలో చేనేత సంక్షేమానికి కృషి చేయాలని సంధారాఘవ లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. లోకేశ్‌ను కలిసిన వారిలో టీడీపీ నా యకులు సంధా రవీంద్ర, జింకాపురుషోత్తం, కొత్తపేట ఆది, సాయి తదితరులు ఉన్నారు.

# విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి: డీఈఓ




రాష్ట్ర స్థాయికి ఎంపికైన స్మార్ట్ ఈవీ కారు ప్రాజెక్ట్, ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్ ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కొత్తచెరువు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ఉపాధి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డీఈఓ క్రిష్ణప్ప తెలిపారు. జిల్లాస్థాయి నైపుణ్య పోటీలను శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నపాఠశాలలో నిర్వహంచారు. కార్యక్రమానికి డీఈఓ క్రిష్ణప్ప ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ నైపుణ్య పోటీలకు జిల్లాలోని 110 ఒకేషనల్ పాఠశాలల చెందిన 600 మంది విద్యార్థులు, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్స్ రూపొందించిన 240 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇందులో 10 ప్రాజెక్టులు 30 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఇందులో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్, అగ్రికల్చర్, రిటైల్, హెల్త్‌కేర్,ఫుడ్ ప్రాసెసింగ్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, బ్యాంకింగ్, ఫైనాన్సియల్ ప్రాజెక్టులు ఎంపికయ్యాయని ఎస్ఎస్ఏ ఏపీసీ దేవరాజ్, అలెస్కో ఆనంద్‌బాబు తెలిపారు. క్యాక్రమంలో జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్, సంస్కృతి, బిట్స్ కళాశాలల అధ్యాపకులు, ఒకేషనల్ అధికారి మధు తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల అపహరణకు యత్నం

తనకల్లు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడ్డిపల్లిలో గురువారం రాత్రి దొంగలు గొర్రెలను అపహరించేందుకు యత్నించారు. వివరాల మేరకు.. మల్లయ్య, సరస్వతమ్మ దంపతులకు 60 గొర్రెలు ఉన్నాయి. గురువారం రాత్రి గొర్రెలను ఇంటిముందున్న ఉన్న షెడ్‌లో తోలి బీగం వేసుకున్నారు. వారు ఇంటిలో పడుకున్నారు. పొద్దుపోయిన తరువాత మల్లయ్య, సర్వసతమ్మ పడుకున్న ఇంటికి గడియ పెట్టి.. షెడ్ బీగాలు పగులగొట్టి గొర్రెలను అపహరించడానికి యత్నించారు. షెడ్ నుంచి గొర్రెలన్నింటిని బయటకు తీసుకొచ్చారు. కొన్ని గొర్రెలు అరవడంతో నిద్రలో ఉన్న సరస్వతమ్మ మేల్కొని తలుపు తీయడానికి ప్రయత్నించారు. గడియ వేసి ఉండడంతో తలుపు రాలేదు. తన భర్తను కూడా నిద్రలేపి గట్టిగా కేకలు వేశారు. దీంతో దొంగలు గొర్రెలను వదిలేసి పరారైనట్లు తెలిపారు. రెండు రోజులక్రితం ఇదే గ్రామంలో జయచంద్ర అనే మోటారు మెకానిక్ ఇంటి బయట మరమ్మతుల కోసం తీసుకొచ్చిన రెండు విద్యుత్ మోటార్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు చెప్పారు.

# టీడీపీ నాయకుడికి పల్లె నివాళి



శ్రీరాములునాయుడుకు నివాళులర్పిస్తున్న పల్లె

నల్లచెరువు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నయల్లంపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గాలివీటి శ్రీరాములు నాయుడు గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి శుక్రవారం మృతుడి గ్రామానికి వచ్చి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు నాగభూషణ నాయుడు, బీజేపీ నాయకులు శరత్ కుమార్‌రెడ్డి ఉన్నారు.

# చిత్రావతి పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

పుట్టపర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిత్రావతి పరివాహక ప్రాంతాల్లోని ఆక్రమణలు అధికారులు తొలగించారు. శుక్రవారం స్థానిక చిత్రావతి నది హారతి ఘాట్ దగ్గరలో ఉన్న ఆక్రమణలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. సత్యసాయి శతజయంతి వేడుకలలో భాగంగా చిత్రావతి నది పరివాహక ప్రాంతాన్ని సుందరీకరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా నది ఒడ్డునున్న అనధికార నిర్మాణాలను తొలగించారు. చిత్రావతి నది పక్కన వెళుతున్న రోడ్డు ఇరుకుగా ఉండడంతో విస్తరణ చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆక్రమణలు తొలగించారు. ఎన్నో ఏళ్లుగా షెడ్లు, ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉన్నామని వాటిని అధికారులు తొలగించడం అన్యాయం అంటూ బాధితుడు శంకర్ వాపోయాడు.

# ఘనంగా హాకీ శతాబ్ది ఉత్సవాలు

ధర్మవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో హాకీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హాకీ పోటీలు నిర్వహించారు. శుక్రవారం జరిగిన హాకీ పోటీల్లో నాలుగు జట్లు పాల్గొన్నాయి. గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. అనంతరం హాకీ సీనియర్ క్రీడాకారులు జిక్రియ, కోనేటి ఆచార్యులు, రామచంద్ర, గౌరీప్రసాద్, మహమ్మద్‌అస్లాంను హాకీ అసోషియేషన్ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో హాకీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాశ్, ముఖ్యులు అరవింద్‌గౌడ్, చందు, మారుతి, కిరణ్, హుస్సేన్ పాల్గొన్నారు.

## విద్యాసామగ్రి పంపిణీ

నంబులపూలకుంట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాటిమానుగుంత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తల్లిదండ్రులు సిద్దమ్మ, వెంకటరమణ జ్ఞాపకార్థం 15 మంది విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. శుక్రవారం ఎంఇఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అక్రమబాషా, రాజశేఖర్, గంగాధర్, స్కూలు కమిటీ చైర్మన్ సుధాకర్ పాల్గొన్నారు.

## ఆలయంలో చోరీ

నల్లచెరువు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవరెడ్డిపల్లి సమీపంలో ఉన్న యాతంబావి గంగమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ఆలయ పూజారి తెలిపిన మేరకు.. శుక్రవారం మధ్యాహ్నం ఆలయంలోకి చొరబడిన దుండగులు గేట్ తాళాలు పగలగొట్టారు. ఆలయంలోకి ప్రవేశించి హుండీని ధ్వంసం చేసి అందులో భక్తులు వేసిన కానుకలు, హుండీలో వేసిన నగదు సుమారు రూ. 15వేలు ఎత్తుకెళ్లారని తెలిపారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ రమణ తెలిపారు.



పుట్టపర్తి విమానాశ్రయంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి

# మంత్రికి వినతుల వెల్లువ

ధర్మవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవం రోజు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నేతన్ననేస్తం కింద రూ.25వేలు పథకాన్ని వెంటనే అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటనారాయణ, గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి శుక్రవారం ధర్మవరానికి వచ్చిన మంత్రి లోకేశ్‌కు వినతి పత్రం అందజేశారు. వర్షాకాలంలో చేనేత కార్మికులకు ఉపాధి లేకుండా పోతోందని, నాలుగునెలల పాటు భృతి ఇవ్వాలని, ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మిక కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని కోరారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని లోకేశ్‌కు అందజేశారు.

**వార్డు సమస్యలపై వినతి**

ధర్మవరం పట్టణంలోని 25వ వార్డులో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు, నాయకులు చీమల రామాంజి, గడ్డం సూరి, కార్తీక్ బాబు తదితరులు మంత్రి లోకేశ్‌కు విన్నవించారు. పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

● కదిరి అర్బన్ : వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాల వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి కోరారు. శుక్రవారం పుట్టపర్తి విమానాశ్రయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రాంతీయ వ్యత్యాసాలను తొలగించి వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో పునరుద్ధరణ చేయాలని విన్నవించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

● బుక్కపట్నం: కూటమి ప్రభుత్వ రావడానికి ఆర్యవైశ్యుల కృషి ఎంతో ఉందని, తమకు నామినేటెడ్ పదవులు కేటాయించాలని ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి పోలేపల్లి ప్రశాంత్ కుమార్ మంత్రి లోకేశ్‌ను కోరారు. ఈ మేరకు పుట్టపర్తి విమానాశ్రయంలో వినతి పత్రం ఇచ్చారు.

# రామలింగేశ్వర ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

బత్తలపల్లి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంతసాగరంలో శుక్రవారం రామలింగేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామంలో నూతనంగా రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. శుక్రవారం ధ్యాన పూజ, అంకురార్పణం, మహాగణపతి హోమం, దీక్షా హోమం, జలాధివాసం మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ప్రాతఃకాలపూజ, జపాలు, పారాయణాలు, నవగ్రహహోమం, దీక్షా హోమం, రామలింగేశ్వరస్వామి మంత్ర హోమం, చండీహోమం, వాస్తు హోమం, గణపతి హోమం, ధ్వజహోమం,లలితా హోమం, మంత్ర పుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు యంత్ర ప్రాణ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, జ్వాలా తోరణం నిర్వహిస్తారని గ్రామ పెద్దలు తెలిపారు.

---

**మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము**
**డి.ఆర్.ఏ.37/2025**

మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం బ్రాంచ్ -- డిస్‌ఫూటెంట
వర్సెస్
కె.యస్.గిరి ప్రసాద్ మరియు ఇతరులు - అపోనెంట్స్

**అపోనెంట్ 2కి నోటీసు**

2,బి.వి.కళ్యాణ్ చక్రవర్తి, తండ్రి: బి.వి. రామనందమ్, వయస్సు: 40 సం॥లు, ఉద్యోగి: డిప్యూటీ తహశీల్దారు (చెక్ పోస్ట్) కలెక్షన్ .సి.సి నివాసం: డో.నెం:3-472, బ్రాహ్మణ వీది, కొత్తచెరువు , శ్రీ సత్య సాయి జిల్లా.
డిస్‌ఫూటెంట్, డిస్‌ఫూట్ బాకీమొత్తం రూ. 1,98,128/-లు రాబట్టుకొనుట కు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌పూట్ లో 2కి అపోనెంట్ అయిన మీరు 26-11-2025 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపుర ము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ఫూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

---

**మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము**
**డి.ఆర్.ఏ.38/2025**

మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం బ్రాంచ్ -- డిస్‌ఫూటెంట్
వర్సెస్
పి.రమేష్ మరియు ఇతరులు - అపోనెంట్స్

**అపోనెంట్ 3 మరియు 5కి నోటీసు**

3,ఉజ్జప్ప గారి నరేష్,తండ్రి: యు.లక్ష్మయ్య , వయస్సు: 33 సం॥లు, ఉద్యోగి: యస్.జి. టీచర్,మునిసిపల్ స్కూలు రాయదుర్గం, నివాసం: డో.నెం:2-160,సాయినగర్, బైరాపురం గ్రామం,కొత్తచెరువు మం॥శ్రీ సత్య సాయి జిల్లా.
5, మాతాంగి దామోదర్, తండ్రి: యం. గోవిందప్ప, వయస్సు:37 సం॥లు, ఉద్యోగి: పోలీస్ కానిస్టేబుల్, ఇంటలిజెంట్స్ డిపార్టుమెంటు,పి.సి.నెం.1599, కదిరి, నివాసం: డో.నెం:6-450, గంటాపురం గ్రామం, బత్తలపల్లి మం॥, శ్రీ సత్య సాయి జిల్లా.
డిస్‌ఫూటెంట్, డిస్‌ఫూట్ బాకీమొత్తం రూ. 7,15,691/-లు రాబట్టుకొనుట కు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ఫూట్ లో 3మరియు 5కి అపోనెంట్ అయిన మీరు 26-11-2025 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపుర ము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ఫూట్ మీ పరోక్ష మున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

---

**మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము**
**డి.ఆర్.ఏ.34/2025**

మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, తాడిపత్రి బ్రాంచ్ -- డిస్‌ఫూటెంట్
వర్సెస్
కటిక లక్ష్మణ్ మరియు ఇతరులు - అపోనెంట్స్

**అపోనెంట్ 1,3 మరియు 5కి నోటీసు**

1,కటిక లక్ష్మణ్, తండ్రి: కె.నాగేష్, వయస్సు: 27 సం॥లు, నివాసం: డో.నెం: 4-85, క్రుమ్మరవాండ్ల గ్రామం కదిరి మం॥ శ్రీ సత్య సాయి జిల్లా.
3, నల్లసాని చంద్రమోహన్, తండ్రి: యన్. రామచంద్ర, వయస్సు: 34 సం॥లు, ఉద్యోగి: వెల్ఫేర్ & ఎడ్యుకేషన్ అసిస్టెంట్, సచివాలయం, ఎదురుదొన గ్రామం, నంబులపూలకుంట మం॥ నివాసం: డో.నెం:7-84B, మద్దన్నగారిపల్లి గ్రామం, గాండ్లపెంట మం॥ శ్రీ సత్య సాయి జిల్లా.
5,కటిక నాగేష్, తండ్రి: కె.పెద్ద పుల్లప్ప, వయస్సు: 59 సం॥లు,రియల్ ఎస్టేట్ వ్యాపారం,కదిరి నివాసం: డో.నెం: 4-85, కుమ్మరవాండ్ల గ్రామం కదిరి మం॥ శ్రీ సత్య సాయి జిల్లా.
డిస్‌ఫూటెంట్, డిస్‌ఫూట్ బాకీమొత్తం రూ. 5,13,025/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ఫూట్‌లో 1,3 మరియు 5కి అపోనెంట్ అయిన మీరు 26-11-2025 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ఫూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

---

**మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము**
**డి.ఆర్.ఏ.29/2025**

మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కదిరి బ్రాంచ్ -- డిస్‌ఫూటెంట్
వర్సెస్
పి.నాగేశ్వరి మరియు ఇతరులు - అపోనెంట్స్

**అపోనెంట్ 6కి నోటీసు**

6,పి.మల్లికార్జున రెడ్డి, తండ్రి:పి.క్రిష్టా రెడ్డి, వయస్సు:45 సం॥లు, నివాసం: డో.నెం.:3-130-21-A1, నల్లగుట్ట వీది, కదిరి , శ్రీ సత్య సాయి జిల్లా.
డిస్‌ఫూటెంట్, డిస్‌ఫూట్ బాకీమొత్తం రూ. 7,46,205/-లు రాబట్టుకొనుట కు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌పూట్ లో 6కి అపోనెంట్ అయిన మీరు 26-11-2025 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపుర ము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ఫూట్ మీ పరోక్ష మున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

---

**మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము**
**డి.ఆర్.ఏ.32/2025**

మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కదిరి బ్రాంచ్ -- డిస్‌ఫూటెంట్
వర్సెస్
మండల అమృత లీలా మరియు ఇతరులు - అపోనెంట్స్

**అపోనెంట్ 2కి నోటీసు**

2, నంబూరి శాంతి, భర్త: గొంది విక్టర్, వయస్సు:59 సం॥లు, ఉద్యోగి: మల్టీ హెల్త్ సూపర్‌వైజర్ (F) ప్రైమరీ హెల్త్ సెంటర్, బుక్కపట్నం మం॥, నివాసం: డో.నెం:4-117,మండిబజార్, కాశసముద్రం గ్రామం, కదిరి మం॥ శ్రీ సత్య సాయి జిల్లా.
డిస్‌ఫూటెంట్, డిస్‌ఫూట్ బాకీమొత్తం రూ. 6,10,544/-లు రాబట్టుకొనుట కు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ఫూట్ లో 2కి అపోనెంట్ అయిన మీరు 26-11-2025 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపుర ము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ఫూట్ మీ పరోక్ష మున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

---

**మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము**
**డి.ఆర్.ఏ.31/2025**

మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కదిరి బ్రాంచ్ -- డిస్‌ఫూటెంట్
వర్సెస్
పి.రాధమ్మ మరియు ఇతరులు - అపోనెంట్స్

**అపోనెంట్ 3కి నోటీసు**

3, కత్తి గోవిందప్ప,తండ్రి: కె.క్రిష్టయ్య, వయస్సు:46 సం॥లు, ఉద్యోగి: యస్.జి. టీచర్ యం.పి.యు.పి.స్కూలు, మొలకవారి పల్లి గ్రామం, ఓబులదేవర చెరువు మం॥, శ్రీ సత్య సాయి జిల్లా.
డిస్‌ఫూటెంట్, డిస్‌ఫూట్ బాకీమొత్తం రూ. 9,37,650/-లు రాబట్టుకొనుట కు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ఫూట్ లో 3కి అపోనెంట్ అయిన మీరు 26-11-2025 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపుర ము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ఫూట్ మీ పరోక్ష మున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

---

**మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము**
**డి.ఆర్.ఏ.33/2025**

మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కదిరి బ్రాంచ్ -- డిస్‌ఫూటెంట్
వర్సెస్
తంగేడికుంట శివమ్మ మరియు ఇతరులు - అపోనెంట్స్

**అపోనెంట్ 1,2,3 మరియు 4కి నోటీసు**

1, తంగేడుకుంట శివమ్మ, భర్త: టి.నాగప్ప, వయస్సు: 56సం॥లు, ఉద్యోగి: కదిరి మునిసిపాలిటీ కాంట్రాక్ట్ బేసిస్ IV క్లాస్ ఎంప్లాయి నివాసం: డో.నెం:1-115, చలమకుంట్ల పల్లి గ్రామం, కదిరి మం॥ శ్రీ సత్య సాయి జిల్లా.
2,తాటిచర్ల అబ్దుల్‌మునాఫ్, తండ్రి: టి.గూడు సాహెబ్, వయస్సు: 58 సం॥లు, ఉద్యోగి: కండక్టర్,APSRTC కదిరి డిపో, నివాసం: డో.నెం:పోస్టాఫీసు వీధి, ములకలచెరువు శ్రీ సత్య సాయి జిల్లా.
3,చెరుకూరి పుల్లయ్య, తండ్రి: సి.యర్రయ్య, వయస్సు: 61 సం॥లు, ఉద్యోగి: పబ్లిక్ హెల్త్ వర్కర్ కదిరి మున్సిపాలిటీ, కదిరి. నివాసం: డో.నెం:1-558-50-1,రాజీవ్‌గాంధీ నగర్, కదిరి, శ్రీ సత్య సాయి జిల్లా.
4, వేగ్గన్న గారి పక్కీరప్ప, తండ్రి: వి.మారెప్ప, వయస్సు: 48సం॥లు, ఉద్యోగి: స్కూలు అసిస్టెంట్, జడ్.పి.హెచ్ స్కూలు కొండకమర్ల గ్రామం, ఓబుళచెరువు మం॥ శ్రీ సత్య సాయి జిల్లా.
డిస్‌ఫూటెంట్, డిస్‌ఫూట్ బాకీమొత్తం రూ. 1,18,972/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ఫూట్‌లో 1,2,3 మరియు 4కి అపోనెంట్ అయిన మీరు 26-11-2025 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ఫూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

న్యూస్ బాక్స్

## సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



సమస్యలు తెలుసుకొంటున్న ఎమ్మెల్యే

మడకశిరటౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి శుక్రవారం టీడీపీ క్యాంప్ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు అన్నారు. శుక్రవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి ప్రజల నుంచి వినతులను ఎమ్మెల్యే స్వీకరించారు. నియోజకవర్గం వ్యాప్తంగా వందలాది మంది తమ సమస్యలు చెప్పుకొనేందుకు బారులుతీరారు. భూ సమస్యల పరిష్కారం కోసం వినతులను అందించారు. ఇంటి నిర్మాణం కోసం తమకు స్థలాలు కేటాయించాలని పలువురు విన్నవించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిష్కారమయ్యే సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని సంబంధిత అధికారులతో ఫిర్యాదులకు సంబంధించి రివ్యూ నిర్వహిస్తామని తెలిపారు.

## వైభవంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న బీకే పార్థసారథి, టీడీపీ నాయకులు

రొద్దం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక దళితవాడలో వెలిసిన ముత్యాలమ్మదేవి ఆలయ వార్షికోత్సవ పూజల్లో ఎంపీ బీకే పార్థసారధి పాల్గొన్నారు. రెండు రోజులుగా కార్తీకపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. శుక్రవారం మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, సుబ్బరత్నమ్మ, మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య, మురళి, రామకృష్ణ, శ్రీనివాసులు, శంకర్, గోపాల్, సిద్దప్ప, నాగరాజు, మున్నా పాల్గొన్నారు.

## ఘనంగా గౌరమ్మ పండుగ

గుడిబండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్. రాయపురంలో గౌరమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు పూజలు చేశారు. అనంతరం పళువులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ సమీపంలో అగ్గిమంట చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

## సొంత ఖర్చుతో పాఠశాల గది నిర్మాణం



పాఠశాల అదనపు గదిని ప్రారంభిస్తున్న ఎంఈఓ గోపాల్

గోరంట్ల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూగానిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సొంత ఖర్చుతో అదనపు గదిని నిర్మించి ప్రశంసలందుకున్నారు. అదనపు గదిని ఎంఈఓ గోపాల్ శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పాఠశాలలో 25మంది విద్యార్థులు ఒకే గది లో హెచ్ఎం క్రిష్టప్ప, ఉపాధ్యాయులు రేష్మా బోధిస్తున్నారు. ఒకే గదిలో బోధన కష్టంగా ఉండడంతో వారిద్దరు రూ.50వేలు సొంత నిధులతో పక్కనే రేకుల షెడ్‌తో అదనపు గదిని నిర్మించారు.

## పాఠశాల భవనానికి మరమ్మతు చేపట్టండి



మద్రాసు ప్రెసిడెన్సీ పాలనలో నిర్మించిన పాఠశాల భవనం

ఆగళి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మద్రాస్‌వారి హయాంలో 1930లో మండల కేంద్రంలో నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. 95 ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనం నేటికీ చెక్కుచెదరలేదన్నారు. పైకప్పు శిథిలావస్థకు చేరుకుందని మరమ్మతులు చేపడితే మరో వందేళ్లు పనిచేస్తుందని వారు తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చొరవ తీసుకుని పాఠశాల భవనానికి నిధులు మంజూరు చేయించి మరమ్మతులు చేయించాలన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారం



బోరుబావి వద్ద అధికారులు, గ్రామస్థులు

గుడిబండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిపల్లి తండాలో నెలకొన్న తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించారు. గ్రామస్థులు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనునాయ్, ఏఈ హరి చొరవ తీసుకుని కొత్తగా వేసిన బోరుకు మోటారు బిగించారు. 15రోజుల క్రితం బూదిపల్లి తండా గ్రామానికి చెందిన మహిళలు తాగునీటి కోసం రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని తాగునీటి సమస్యను పరిష్కరించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, బీసీసెల్ అధ్యక్షుడు జయరామప్ప పాల్గొన్నారు.

## ఎరువులను సద్వినియోగం చేసుకోండి



ఎరువులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

గుడిబండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సహకార సంఘం ఆధ్వర్యంలో పంపిణీచేసే ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప సూచించారు. శుక్రవారం ఎరువులను రైతులకు పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ఎస్సీసెల్ అధ్యక్షుడు మంజునాథ్, సీఈఓ రాజన్న, రైతులు పాల్గొన్నారు.

# పచ్చని చెట్లు బొగ్గుపాలు..!

● పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బొగ్గుల బట్టీలు
● పట్టించుకోని అటవీశాఖ అధికారులు

అమరాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలం కర్ణాటకకు సరిద్దు కావడంతో పచ్చని చెట్లు నరికివేస్తున్నా అటవీశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని అనేక గ్రామాల్లో పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అంటూ అధికారులు ఉపన్యాసాలు ఇచ్చి మిన్నకుండిపోతున్నారు. కూటమి ప్రభుత్వం కోటిచెట్లు నాటే కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అటవీశాఖ అధికారులు మాత్రం వాటికి తూట్లు పొడుస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెట్లను సంరక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. పచ్చని చెట్లు బొగ్గు పాలవుతున్నాయి. అటవీశాఖాధికారుల నిర్లక్ష్యం పర్యావరణ పరిరక్షణకు శాపంగా మారిందని ప్రజలు మండిపడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా రక్షించుకుంటూ వచ్చిన పచ్చని చెట్లు నిత్యం నరికివేతకు గురవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చించి మొక్కలు నాటిస్తున్నా అది కేవలం మొక్కుబడిగానే మిగిలిపోతోంది.



చింత చెట్లను నరికివేసి కాల్చడానికి బట్టీలో ఉంచిన దృశ్యం



బస్తాల్లో నింపిన బొగ్గులు

నాటిన మొక్కలు మాట అటుంచితే ఏళ్లతరబడి పెరిగిన చెట్లు నిమిషాల్లో యంత్రాలు, గొడ్డళ్లతో నరికి వేస్తున్నారు. ఈ తతంగాన్ని చూస్తున్న అన్నిశాఖల అధికారులు మిన్నకుండిపోవడం శోచనీయం.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బొగ్గు బట్టీలు

మండల కేంద్రంలో బొగ్గుల బట్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నిత్యం ఆ బట్టీల్లో పచ్చనిచెట్లు ఆహుతవుతున్నాయి. మండలంలోని కొర్రేవు, హేమావతి, తంబాలహట్టి తదితర గ్రామాల్లో మూడు బట్టీలున్నాయి. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఏ ఒక్కటి అనుమతి పొందలేదు. పట్టపగలే యథేచ్ఛగా నరికిన చెట్లను బొగ్గుల బట్టీకి తరలించడం పరిపాటి. అటవీశాఖ విశ్రాంతి భవనం ముందునుంచే వేపచెట్లను నరికి తరలిస్తున్నా పట్టించుకోకపోవడం కొసమెరుపు.

**కంపచెట్లకే అనుమతి: సంజీవరాయుడు, అటవీ అధికారి**

బొగ్గుల బట్టీలకు కంప చెట్లను మాత్రమే వినియోగించాలి. అందుకు అనుగుణంగా మూడింటికి అనుమతులున్నాయి. కంపచెట్లు కాకుండా ఇతర చెట్లను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

## పది విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న క్రియేటర్ క్రిష్ణ

లేపాక్షి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. సువర్ణ భారతి కళాశాలలో శుక్రవారం హైదరాబాద్ నుంచి వచ్చిన క్రియేటర్ క్రిష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. మండల వ్యాప్తంగా 650 మంది పదోతరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షలు ఎలా రాయాలో మెలకువలను ఆయన వివరించారు. జాన్ రెడ్డప్ప, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ లాజర్, ఎంఈఓ నాగరాజునాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**శిక్షణ తరగతుల పరిశీలన**

పెనుకొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాలలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్, ఎంఎల్‌టీ ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను త్రిసభ్య కమిటీ సభ్యులు శుక్రవారం పరిశీలించారు. ఆధ్యాపకురాలు శ్రీలేఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఓంకార్, త్రిసభ్య కమిటీ చాంద్ బాషా పాల్గొన్నారు. మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ మహిళా విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు.

**పది పరీక్ష కేంద్రాలు..**

హిందూపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదోతరగతి పరీక్ష కేంద్రాలను విద్యాశాఖాధికారులు శుక్రవారం పరిశీలించారు. జిల్లా ఉప విద్యాధికారి జాన్ రెడ్డప్ప, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ లాజర్ ఎంఈఓలతో పాఠశాలలను పరిశీలించారు.

**ఎంపీడీఓపై దాడి అమానుషం**

రొద్దం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రొళ్ల ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రిపై దాడి అమానుషమని ఏపీజేఏసీ అధ్యక్షుడు బాస్కర్‌రెడ్డి ప్రకటనలో ఖండించారు. గురువారం ఎంపీడీఓపై మాజీ ఎంపీపీ భర్త దుర్భాషలాడి చేయిచేసుకోవడంపై ఉద్యోగులు మండిపడ్డారు. తప్పు చేసినవారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

**అయ్యప్పలకు భిక్ష ఏర్పాటు**

సోమందేపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారుతినగర్‌లో వెలిసిన అయ్యప్ప ఆలయంలో శుక్రవారం మాలధారులకు ముస్లింల భిక్ష ఏర్పాటు చేశారు. 200మంది స్వాములకు భిక్ష వడ్డించి పరమతసహనాన్ని చాటారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ముస్లింలను అయ్యప్పలు ఆశీర్వదించారు. గురుస్వాములు, అయ్యప్పలు పాల్గొన్నారు.

## అంధకారంలో కోనాపురం



వీధిలైట్లు లేక అంధకారంలో కోనాపురం ఎస్సీ కాలనీ

పెనుకొండ రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నగర పంచాయతీ కోనాపురంలో అంధకారం నెలకొంది. పదిరోజులుగా ఎస్సీకాలనీలో వీధిలైట్లులేక గ్రామంలోని ప్రజలు ఇంటి నుంచి బయటకు రాలేక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో వీధిలైట్లు లేకపోవడంతో విషపురుగులు సంచరిస్తున్నాయని, ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. నగర పంచాయతీ అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

పెనుకొండ టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భార్యతో విభేదాలతో మనస్థాపానికి గురై చాకలి కిరణ్(27)ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు పెనుకొండ పట్టణం ఎగువగడ్డకు చెందిన కిరణ్‌కు కళ్యాణదుర్గం మండలం కోడిపల్లికి చెందిన సంధ్యారాణితో 2022లో వివాహం జరిగింది. మూడేళ్లపాటు దాంపత్యజీవితం అన్యోన్యంగా సాగింది. కొన్ని నెలల నుంచి వారి మధ్య సమస్యలు ఏర్పడి విడిగా ఉంటున్నారన్నారు. ఇటీవల కోర్టులో విడాకులకోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై 5వ తేదీన వాయిదాలకు వచ్చినప్పుడు ఇరువురు కలిసి రాజీ అయినా అవుదాం, లేదా విడాకులైనా తీసుకుందామని కోరారు. అదే రాకపోవడంతో భర్త భార్యకు ఫోన్‌చేయగా స్పందించకపోవడంతో మనస్థాపానికి గురైన కిరణ్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. కిరణ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు**

గోరంట్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిందూపురం ప్రధాన రహదారి మల్లాపల్లి సమీపంలో ద్విచక్రవాహన ప్రమాదంలో రామ్‌చరణ్, చంద్రాయుడు అనే వ్యక్తులు శుక్రవారం గాయపడ్డారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు బూగానిపల్లికి చెందిన మద్దిలేటి కుమారుడు రామ్‌చరణ్ హిందూపురం వద్దనున్న బిట్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దీనిపై హిందూపురం రహదారిపై ఉదయం వాకింగ్‌కు వెళ్లిన సమయంలో గోరంట్ల పట్టణం పెద్దూరుకు చెందిన చంద్రాయుడు ద్విచక్రవాహనంపై వెళ్తూ అదుపు తప్పి రామ్‌చరణ్‌ను ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఇద్దరూ గాయపడడంతో రామ్‌చరణ్ అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఇద్దరినీ గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీర్ఘకాలంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆసుపత్రికి తరలించారు. రామ్‌చరణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**గుప్తనిధుల కోసం తవ్వకాలు**

రొద్దం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రెడ్డిపల్లి గ్రామ శివారులో ఉన్న పురాతన యల్లమ్మ ఆలయంలో గుప్తనిధుల గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు చేపట్టారు. గురువారం అర్ధరాత్రి మండలంలోని రెడ్డిపల్లి గ్రామశివారులో కట్టకింద ఉన్న యల్లమ్మ ఆలయంలో దుండగులు గుప్తని ధి కోసం తవ్వకాలు చేపట్టారు. శుక్రవారం గ్రామస్తులు ఆలయంలో పూజల కోసం వెళ్లగా తవ్వకాలు బయటపడటంతో చర్చనీయాంశంగా మారింది.

**నేడు పట్టాభిరామ్ రాక**

హిందూపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ శనివారం హిందూపురంలో పర్యటించనున్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగే సమీక్షకు హాజరవుతారు.

**నేడు కనకదాస జయంతి:** కురుబల ఆరాధ్యదైవం కనకదాస జయంతిని హిందూపురంలో శనివారం ఘనంగా జరుపనుంది. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం సందర్భంగా ఆర్టీసీ బస్టాండు కనకదాస విగ్రహం వద్ద జరిగే వేడుకల్లో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**కనకదాస జయంతిని విజయవంతం చేయండి**

పెనుకొండ రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భక్త కనకదాస జయంతిని కురుబలు కలిసికట్టుగా విజయవంతం చేయాలని మండల కన్వీనర్ ఈశ్వర్‌ప్రసాద్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కనకదాస జయంతి రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా జరుపుకుంటున్నామని మంత్రి సవిత ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.

**ఆరోగ్య విషయాలపై అవగాహన**

ఆగళి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిజాం మెడికల్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్ నుంచి వచ్చిన పీజియోథెరపీ డాక్టర్ సంతోష్, రమేష్ అవగాహన కల్పించారు. ఆరోగ్య సూత్రాలను వివరించారు. అనంతరం కిట్లను అందజేశారు. ఎంఈఓ కృష్ణమూర్తి రాజు, చంద్రశేఖర్‌నాయుడు, హెచ్ఎంలు పాల్గొన్నారు.



మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీ బీకే, ఎమ్మెల్యే రాజు

## మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం



మాజీ ఎమ్మెల్సీ గుండుమల

మడకశిరటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారాలోకేశ్‌ను శుక్రవారం పుట్టపర్తి ఎయిర్‌పోర్ట్‌లో ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి స్వాగతం పలికారు. కళ్యాణదుర్గంలో శనివారం జరిగే కనకదాస విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి శుక్రవారం పుట్టపర్తికి చేరుకొన్నారు.

## చేనేతలకు అందని ఉచిత విద్యుత్



చేనేతలకు వచ్చిన సాధారణ కరెంటు బిల్లు

సోమందేపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వంద యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని చేనేతలకు అందిస్తున్నా వాటి ఫలాలు అందడంలేదు. మండల కేంద్రంలోని నక్కలగుట్ట కాలనీలో నివాసముంటున్న బెస్త వెంకటేశులు, మామిళ్ల శ్రీనివాసులు ఉచిత విద్యుత్ కోసం ఆరునెలల క్రితం దరఖాస్తు చేసుకున్నారు. మంజూరు కాకపోవడంతో రెండు నెలల క్రితం ప్రజా పరిష్కార వేదికలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. అయినా ఫలితంలేదని వారు శుక్రవారం మీడియాతో గోడువెళ్లబోసుకున్నారు. ఉచిత విద్యుత్ పథకంలో సిఫార్సుకు పెద్ద పీట వేస్తూ అనర్హులకు పథకాన్ని వర్తింపచేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్‌శాఖ అధికారులు చొరవతీసుకుని చేనేత సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సంఘం నాయకుడు నారాయణస్వామి హెచ్చరించారు.

## ఎంపీడీఓపై దాడిచేసిన వారిని శిక్షించాలి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న ఏపీఎన్‌జీఓ సంఘం నాయకులు

మడకశిరటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రొళ్ల ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రిపై దాడిచేసిన మాజీ ఎంపీపీ భర్త విజయరంగేగౌడ్‌ను కఠినంగా శిక్షించాలని ఏపీ ఎన్‌జీఓ తాలూకా అధ్యక్షుడు రాము, ఉపాధ్యక్షుడు హరినాథ్, సిగ్గుట్ల డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. బిల్లుల విషయమై విజయరంగేగౌడ్ దాడిచేయడం అమానుషం అన్నారు. మండల స్థాయిఅధికారిపై ఇలా దాడి చేయడం అమానుషమని బాధితులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు, ఏపీఎన్‌జీఓ మినిస్టీరియల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

**ఎంపీడీఓపై దాడిచేసిన వ్యక్తికి రిమాండ్**

రొళ్ల(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రిపై వైఎస్సార్సీకి చెందిన మాజీ ఎంపీపీ భర్త విజయ రంగేగౌడ్ దాడిచేయడంపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడిని ఎస్ఐ అరెస్ట్‌చేసి శుక్రవారం మడకశిర మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా 14రోజుల రిమాండును న్యాయాధికారి విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

## మధ్యాహ్నానికే సచివాలయానికి తాళం



మధ్యాహ్నానికే మూతబడిన ఆర్.లోచర్ల సచివాలయం

రొద్దం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.లోచర్ల గ్రామ సచివాలయ ఉద్యోగులు మధ్యాహ్నానికే తాళం వేసి వెళ్లిపోయారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సచివాలయంలో వీఆర్ఓ, అగ్రికల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్‌లు పనిచేస్తున్నారు. వీఆర్ఓ సూర్యనారాయణ పనినిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి కలిపి సచివాలయానికి వెళ్లారు. మిగిలిన ఉద్యోగులు మధ్యాహ్నం సచివాలయానికి తాళంవేసి వెళ్లిపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ ఇలాగే చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ప్రభుత్వం ఆయాశాఖలకు సంబంధించిన ఉద్యోగులు గ్రామాల్లో మెరుగైన సేవలందించాలని ఆదేశించినా నిర్లక్ష్యంతో ఎవరికివారు యమునాతీరుగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తిని వివరణ కోరగా తనకు చెప్పకనే వెళ్లిపోయారని తెలిపారు.

# ఘనంగా వందేమాతరం వేడుకలు



గోరంట్లలో వందేమాతరం వేడుకల్లో పాల్గొన్న అధికారులు, అమృత మహోత్సవ కమిటీ సభ్యులు

గోరంట్ల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో వందేమాతరం గీతాలాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతానికి 150ఏళ్లు పూర్తయిన సందర్భంగా గోరంట్ల పోలీస్ పరేడ్ మైదానం ఆవరణలో ఆజాదీకా అమృత్ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ, వందేమాతరం గీతాన్ని ఆలపించి, ప్రముఖ్యతను ప్రజలకు వివరించారు. ఎస్ఐ ఉమాదేవి, డిప్యూటీ ఎంపీడీఓ దేవదాసు, సోమశేఖర్, భక్తవత్సల, బలరాంగుప్తా, దామోదర్‌రెడ్డి, రెడ్డిశేఖరప్రసాద్, గోవిందరెడ్డి, శ్రీరాములు, పణికుమార్, లయన్స్‌క్లబ్ సభ్యులు రాజేష్, నాగరాజు, డాక్టర్ పలిశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు. అలాగే ఎస్ఏపీఎస్ ఎయిడెడ్, ఎస్వీఆర్ జూనియర్, ఎస్ఏపీ వీఎం, ఎఎస్‌కె డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వందేమాతర గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, విజయలక్ష్మి, భక్తవత్సలం పాల్గొన్నారు.

రొద్దం(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలలు, సచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో వందేమాతరం 150వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం వందేమాతరం గేయాన్ని ఆలపించి దేశభక్తిని చాటుకున్నారు. ప్రభుత్వ వైద్యాధికారి భార్గవశ్రీ, కౌశిక్, గ్రావణి, రమాదేవి, ఈఓఆర్డీ గోవిందప్ప పాల్గొన్నారు.

మడకశిర రూరల్(ఆంధ్రజ్యోతి): వందేమాతరంగేయం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పాఠశాలల్లో శుక్రవారం వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. టీడీపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం భూతన్న ఆధ్వర్యంలో బంకించంద్ర చటోపాధ్యాయ, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళి అర్పించారు.

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వందేమాతరం గేయం ఆవిర్భవించి 150ఏళ్లు అయిన సందర్భంగా శుక్రవారం వైద్యులు ఓంకార్, ఆయుషీ శర్మ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సిబ్బందితో కలిసి ప్రతిని సందేశం మేరకు వందేమాతరం గీతం ఆలపించారు. అనంతరం జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

రొళ్ల(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బంకించంద్ర చటర్జీ రచించిన జాతీయ గీతం వందేమాతరం 150ఏళ్ల వేడుకలను హెచ్ఎం రవికృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు మహదేవప్ప,యెంజేరప్ప, రెడ్డప్ప, శ్రీనివాసులు, హరికుమార్, వనజాక్షి పాల్గొన్నారు.

అమరాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బంకించంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. హెచ్ఎం లీలారాణి, ఉపాధ్యాయులు తిప్పేస్వామి, నాగభూషణం, శాంతికుమార్, సురేష్, మారుతి పాల్గొన్నారు.

ఆగళి: వందేమాతర గీతం 150 ఏళ్లు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పడి 70ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం వేడుకలు పాఠశాలలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయకుమారి, నారాయణస్వామి పాల్గొన్నారు.

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): వందే మాతరం గీతం మాతృభూమికి గౌరవకారణమని పటేల్ కళాశాల డిగ్రీకళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హరిబాబు అన్నారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వందేమాతరం గీతం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బ్యానర్లు, జాతీయ జెండాలు చేతబట్టి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. యశోదరాణి, ఎన్ఎస్ఎస్ అధికారి హరిప్రసాద్, పీడీ కాంతరావు, ప్రతాప్, నారాయణ, రామన్న, చంద్రమోహన్, సంజీవరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు.



రొద్దం ప్రభుత్వ ఆసుపత్రిలో తెలుగుతల్లి చిత్రపటం వద్ద వైద్య బృందం



పెనుకొండలో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు